


Truth of News

PRGI Reg No: APTEL/26/A4782

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 02 | సంచిక : 08 | ఆదివారం 02 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## నీట్ యూజీ 2026 ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం

- కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించిన ఎన్టీఏ
- ఆగస్టు 4 నుంచి ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్ ప్రారంభం
- సెప్టెంబర్ 8 నుంచి అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల తరగతులు
- సెలవుల్లోనూ పనిచేయాలని మెడికల్ కాలేజీలకు ఆదేశాలు

న్యూఢిల్లీ -సూర్య వాస్తవం



నీట్ యూజీ-2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) శనివారం ప్రకటించింది. దీని ప్రకారం, ఆల్ ఇండియా కోటా సీట్ల భర్తీకి ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల విద్యా సంవత్సరం (అకడమిక్ సెషన్) సెప్టెంబర్ 8 నుంచి మొదలవుతుందని స్పష్టం చేసింది. తొలి రౌండ్‌లో ఆల్ ఇండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీల కౌన్సెలింగ్ ఆగస్టు 4 నుంచి ఓ - మిగతా 2లో..

## అణుశక్తిపై దూకుడు.. వ్యర్థాల నిర్వహణపై మౌనం

- శాశ్వత నిల్వ వ్యవస్థపై వెల్లువెత్తుతున్న ప్రశ్నలు
- పూర్తి సమాచారం అందించకుండానే ముందుకు!
- కేంద్రంలోని మోడీ సర్కారు తీరు
- ప్రతి మెగావాట్‌కు ఏటా 0.15 క్యూబిక్ మీటర్ల రేడియోధార్మిక ఘన వ్యర్థం
- పర్యావరణవేత్తలు, నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ -సూర్య వాస్తవం

దేశంలో అణుశక్తి ఉత్పత్తిని భారీగా పెంచాలని మోడీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే ఈ ప్రక్రియలో ఏర్పడే రేడియోధార్మిక వ్యర్థాల సురక్షిత నిర్వహణపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అణు విద్యుత్‌ను పరిశుభ్రమైన ఇంధనంగా ప్రచారం చేస్తున్న కేంద్రం.. దాని వల్ల ఉత్పత్తయ్యే ప్రమాదకర వ్యర్థాల దీర్ఘకాల నిర్వహణ, భద్రత, పారదర్శకతపై ప్రజలకు తగిన స్థాయిలో సమాచారం అందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో అణుశక్తి శాఖ వెల్లడించిన వివరాలు దేశంలో అణు వ్యర్థాల పరిమాణం, వాటి నిర్వహణపై మరోసారి చర్చకు దారితీశాయి.

**పరిమిత సమాచారమే!**

కేంద్ర అణుశక్తి శాఖ (డీఏఈ) పార్లమెంట్‌లో తెలిపిన



వివరాల ప్రకారం... దేశంలోని అణు విద్యుత్ కేంద్రాలు ప్రతి మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యానికి సంవత్సరానికి సగటున 0.15 క్యూబిక్ మీటర్ల (దాదాపు 150 లీటర్లు) రేడియోధార్మిక ఘన వ్యర్థాన్ని ఉత్పత్తి చేస్తున్నాయి. ఇందులో ప్లాంట్లు పనిచేసే సమయంలోనూ, వాటి సేవా కాలం పూర్తయిన తర్వాత వాటిని తొలగించే డీకమీషనింగ్ ప్రక్రియలోనూ ఏర్పడే వ్యర్థాలు ఉంటాయి. ఈ వ్యర్థాల వివరాలను అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్‌బీ) వద్ద నమోదు చేస్తున్నామని ప్రభుత్వం తెలిపినప్పటికీ... వాటి భద్రత, పర్యావరణ ప్రభావంపై ప్రజలకు అందుబాటులో ఉండే సమాచారం పరిమితంగానే ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

**శాశ్వత వ్యర్థాల నిర్వహణపై స్పష్టత కరువు**

ఫిన్లాండ్ ఇప్పటికే భూమికి 430 మీటర్ల లోతులో 'ఒంకాలో' పేరుతో ప్రపంచంలోనే తొలి శాశ్వత అణు వ్యర్థాల నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. అమెరికా కూడా వినియోగించిన ఇంధనాన్ని ప్రత్యేక కూలింగ్ పూల్స్, డ్రై క్యాస్క్‌లలో భద్రపరుస్తోంది. భారత్ మాత్రం అణుశక్తి విస్తరణను - మిగతా 2లో..



## భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారం..

- సరికొత్త చరిత్రకు నాంది పలికాం: సీఎం చంద్రబాబు
- భోగాపురం ఎయిర్‌పోర్టును ఉత్తరాంధ్రకు మణిహారంగా అభివర్ణన
- భూములిచ్చిన రైతులకు పాదాభివందనం చేస్తున్నట్లు వెల్లడి
- అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారన్న సీఎం
- రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామన్న మాట నిలబెట్టుకుంటున్నామని స్పష్టీకరణ

విజయనగరం-సూర్య వాస్తవం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం లాంటిదని, ఈ ప్రాంత దశ, దిశను మార్చే శక్తి దీనికి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. - మిగతా 2లో..



## భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే..

- ఈ గడ్డపై అడుగుపెట్టడం ఎంతో గర్వకారణం: ప్రధాని మోదీ
- భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ
- ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ప్రధాని మోదీకి బొబ్బిలి వీణను బహూకరించిన ముఖ్యమంత్రి
- గిన్నిస్ రికార్డ్ సాధించిన థింసా నృత్యాన్ని వీక్షించిన ప్రధాని
- ఎయిర్‌పోర్ట్‌లోని ఆధునిక సదుపాయాలను పరిశీలించిన మోదీ

విజయనగరం -సూర్య వాస్తవం

పవిత్రమైన ఉత్తరాంధ్ర గడ్డపై అడుగుపెట్టడం తనకు ఎంతో గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకమైన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం - మిగతా 2లో..



## ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్ట్ కొత్త అధ్యాయం..

- మోదీని విమర్శిస్తుంటే బాధపడ్డా: డిప్యూటీ సీఎం పవన్
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ కీలకమన్న పవన్
- దేశాన్ని మోదీ ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ప్రశంస
- చంద్రబాబు మార్గనిర్దేశంలో ఏపీ అగ్రగామి రాష్ట్రంగా మారుతుందని ధీమా
- ప్రధాని మోదీని విమర్శించడం తనను బాధించిందని వ్యాఖ్య

విజయనగరం-సూర్య వాస్తవం

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి రాష్ట్రంగా మారబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై - మిగతా 2లో..

## భోగాపురం ఎయిర్ పోర్టు క్రెడిట్ వార్..

- ప్రాజెక్టుకు పునాది వేసింది జగనే అన్న వైసీపీ
- అన్ని అనుమతులు జగన్ హయాంలోనే సాధించామని వెల్లడి
- ప్రాజెక్టు విజయంలో చంద్రబాబు పాత్ర లేదన్న వైసీపీ

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



## మధ్యవర్తిత్వం భారత నాగరికతలోనే ఉంది

- వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం భారత సంస్కృతిలో భాగమన్న సీజేఐ సూర్యకాంత్
- జైపూర్‌లో జరిగిన కామన్వెల్త్ మధ్యవర్తిత్వ సదస్సులో కీలక ప్రసంగం

న్యూఢిల్లీ-సూర్య వాస్తవం

వివాదాలను పరస్పర అంగీకారంతో, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడం భారతీయ నాగరికతలో అంతర్భాగమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ - మిగతా 2లో..

## నల్ల చెరువు పునరుజ్జీవంలో హైడ్రా అహర్నిశలు కృషి

- అత్యుత్తమ పనితీరును ప్రదర్శిస్తోన్న రాష్ట్రం.. సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్

హైదరాబాద్ - సూర్య వాస్తవం

ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవానికి హైడ్రా అహర్నిశలు శ్రమించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా హైడ్రా అధికారులకు, సిబ్బందికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈమేరకు శనివారం ట్వీట్ చేశారు. చెరువుల పునరుజ్జీవంతో రూపురేఖలు మారుతున్న హైదరాబాద్‌ను చూడటం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. క్యూర్ పరిధిని క్యూర్ చేసుకుంటూ... మన చెరువులకు జీవం పోస్తూ... జీవంతో నిండిన భవిష్యత్తును భావి తరాలకు హైడ్రా అంకితం చేస్తోందని తెలిపారు. చెరువులను పరిరక్షించడం అంటే కేవలం నీటి వనరులను కాపాడటం - మిగతా 2లో..



## ప్రతిపక్షాల హేళనలకు అభివృద్ధితో సమాధానమిచ్చాం

- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ విమానాశ్రయం సింహద్వారంలా నిలుస్తుందన్న రామ్మోహన్ నాయుడు

2లో

## ఎర్ర బస్సు రాదన్న చోట ఎయిర్‌పోర్టు వచ్చింది

- ఉత్తరాంధ్ర ప్రజలను అవమానించిన వారికి గట్టి జవాబు అని వ్యాఖ్య
- ప్రధాని మోదీ సహకారంతోనే ఏపీలో అభివృద్ధి పనులు అన్న మంత్రి లోకేష్

2లో

# అణుశక్తిపై దూకుడు..
# వ్యర్థాల నిర్వహణపై మౌనం

(మొదటిపేజీ తరువాయి)

వేగవంతం చేస్తున్నప్పటికీ.. శాశ్వత వ్యర్థాల నిర్వహణపై భవిష్యత్ కార్యాచరణను మరింత స్పష్టంగా ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రజల్లో విశ్వాసం కల్పించాలి**

విద్యుత్ ఉత్పత్తి పెంపుపై మాత్రమే కాకుండా.. రేడియోధార్మిక వ్యర్థాల భద్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యంపై దీర్ఘకాల ప్రభావాలను కూడా సమాన ప్రాధాన్యంతో పరిగణించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని పర్యావరణవేత్తలు అంటున్నారు. అణుశక్తి విస్తరణ విజయవంతం కావాలంటే విద్యుత్ ఉత్పత్తి మాత్రమే కాదనీ, వ్యర్థాల నిర్వహణలోనూ పూర్తి పారదర్శకత, శాస్త్రీయ ప్రమాణాలు, ప్రజల విశ్వాసం అత్యంత కీలకమని వారు సూచిస్తున్నారు.

**సవాలుగా రేడియోధార్మిక వ్యర్థాల నిల్వ**

అణు విద్యుత్ కేంద్రాల్లో వాయు, ద్రవ, ఘన రూపాల్లో రేడియోధార్మిక వ్యర్థాలు ఉత్పత్తి అవుతాయి. వాయు, ద్రవ వ్యర్థాలను ప్రత్యేక శుద్ధి అనంతరం నియంత్రణ ప్రమాణాల మేరకు విడుదల చేస్తామనీ, ఘన వ్యర్థాలను రాతి గోడల కందకాలు, బలమైన కాంక్రీట్ నిర్మాణాలు వంటి ప్రత్యేక సౌకర్యాల్లో నిల్వ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. అయితే దేశంలో అణుశక్తి సామర్థ్యాన్ని వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో... ఈ వ్యర్థాల శాశ్వత నిర్వహణకు ఎంత మేర సిద్ధంగా ఉన్నామనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రస్తుతం భారత్ వినియోగించిన అణు ఇంధనాన్ని రీప్రాసెసింగ్ చేసి యురేనియం, ప్లూటోనియంను తిరిగి వినియోగించే విధానాన్ని అనుసరిస్తున్నప్పటికీ.. మిగిలిపోయే అధిక రేడియోధార్మిక వ్యర్థాల నిల్వ దీర్ఘకాల సవాలుగానే మిగులుతోందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# భోగాపురం విమానాశ్రయం
# ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే..

(మొదటిపేజీ తరువాయి)

లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానితో పాటు గవర్నర్ జస్టిస్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, అశోక్‌గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం ప్రధాని మోదీ టెర్మినల్ భవనంలో కలియదిరిగి ఆధునిక సదుపాయాలను పరిశీలించారు. విమానాశ్రయం ప్రత్యేకతలు, నిర్మాణ విశేషాలను జీఎంఆర్ గ్రూపు ఛైర్మన్ జి.మల్లికార్జునరావు, బిజినెస్ ఛైర్మన్ జీబీఎస్ రాజు ప్రధానికి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. ప్రధాని మోదీకి ఉత్తరాంధ్ర కళావైభవానికి ప్రతీకగా నిలిచే బొబ్బిలి వీణను బహూకరించి సత్కరించారు.

సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. నేటి రోజు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో, ముఖ్యంగా స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక కీలకమైన రోజని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యమైన 'థింసా' ప్రదర్శన తనను మధురానుభూతికి లోనుచేసిందని ప్రధాని తెలిపారు. ఒకేసారి 13 వేల మంది గిరిజన మహిళలు ఈ నృత్యం చేయడం ఒక అద్భుతమని, ఇది ప్రపంచ రికార్డు సృష్టించిందని కొనియాడారు. ఈ నృత్యంలో మన తరతరాల వారసత్వం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రధాని మోదీ హృదయపూర్వకంగా అభినందించారు.

భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక కొత్త 'రన్‌వే'గా పనిచేస్తుందని మోదీ ఉద్ఘాటించారు. ఇది ఆంధ్ర యువత ఉజ్వల భవిష్యత్తుకు ఒక 'లాంచ్‌ప్యాడ్' అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో దేశంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒకే కుటుంబం పేర్లు కనిపించేవని, కానీ తమ ప్రభుత్వం మహనీయుల పేర్లను పెడుతోందని స్పష్టం చేశారు. "అయోధ్యలో విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి పేరు పెట్టాం. పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరుతో ఎయిర్‌పోర్ట్ ప్రారంభించాం.

అదేవిధంగా భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం" అని ప్రధాని వివరించారు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# భోగాపురం ఎయిర్‌పోర్టు
# ఉత్తరాంధ్రకు మణిహారం..

(మొదటిపేజీ తరువాయి)

విజయనగరం జిల్లా భోగాపురంలో 'అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం' ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదంటూ అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని, కానీ నేడు ఇక్కడకు ఎయిర్‌బస్ వచ్చిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి అడ్డుపడిన శక్తులను ప్రజలు తిరస్కరించారని అన్నారు. ఈ విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులు ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని చంద్రబాబు ప్రశంసించారు. "రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో నేను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చాం. ఆ హామీని నిలబెట్టుకున్నాం" అని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనంగా నిలిచే ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వకారణమని అన్నారు. ఉత్తరాంధ్ర వాసి జీఎమ్మార్ ఈ ఎయిర్‌పోర్టును నిర్మించడం, దీనికి తొలి అడుగులు వేసిన అశోక్ గజపతిరాజు, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ఈ ప్రాంతం వారే కావడం విశేషమని గుర్తుచేశారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టుల పూర్తిపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, 2028 నాటికి రాజధాని అమరావతి తొలి దశ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను కాపాడింది, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధులు ఇచ్చింది ప్రధాని నరేంద్ర మోదీనే అని కొనియాడారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో తెలంగాణ దశ మారినట్లే, భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రెండేళ్లలో ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 189 ప్రాజెక్టులు తీసుకొస్తామని, తద్వారా 5.57 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రూ.2784 కోట్లతో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని, 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజీకి సైతం అనుమతులు వచ్చాయని తెలిపారు.

విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మించి, టూరిజం, ఫార్మా రంగాలను అభివృద్ధి చేసి ఉత్తరాంధ్ర స్వరూపాన్ని మారుస్తామన్నారు. త్వరలోనే ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకు వలసలు వచ్చే రోజులు వస్తాయని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

## ప్రతిపక్షాల హేళనలకు
# అభివృద్ధితో సమాధానమిచ్చాం

**విజయనగరం-సూర్య వాస్తవం**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం జాతికి అంకితమైన చారిత్రాత్మక ఘట్టంతో ఇప్పుడు ప్రపంచం మొత్తం ఉత్తరాంధ్ర వైపు చూస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. విమానాశ్రయ ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్షాల హేళనలకు తమ అభివృద్ధి పనులతోనే సమాధానమిచ్చామని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం విమానాశ్రయం ఒక బలమైన సింహద్వారంలా నిలుస్తుందని, దీని ద్వారా రాబోయే రోజుల్లో వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. "ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని కేవలం ఎర్రబస్సులు మాత్రమే తిరిగే వెనుకబడిన ప్రాంతం అని కొందరు అవహేళన చేశారు. కానీ ఈ రోజు కళ్లు తెరిచి చూడండి.. ఎర్రబస్సులు తిరిగిన నేలపైనే అధునాతన ఎయిర్‌బస్సులు ల్యాండ్ అయ్యే స్థాయికి ఉత్తరాంధ్ర ఎదిగిందని నిరూపించాం" అని విమర్శకులకు ఘాటుగా కౌంటర్ ఇచ్చారు.

దేశంలోనే ఎక్కడా లేని విధంగా అత్యంత వేగంగా ఉత్తరాంధ్రలో ప్రగతి పరుగులు పెడుతోందని వెల్లడించిన రామ్మోహన్‌నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయకత్వంపై ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచం గర్వించే నాయకుడు ప్రధాని మోదీ నేతృత్వంలో 'వికసిత్ భారత్', ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో 'విజన్ 2047' లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో పారిశ్రామికంగా, పర్యాటకంగా ఉత్తరాంధ్ర ముఖచిత్రం పూర్తిగా మారిపోనుందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

## ఎర్ర బస్సు రాదన్న చోట
# ఎయిర్‌పోర్టు వచ్చింది

**- ఉత్తరాంధ్ర ప్రజలను అవమానించిన వారికి గట్టి జవాబు అని వ్యాఖ్య**

**- ప్రధాని మోదీ సహకారంతోనే ఏపీలో అభివృద్ధి పనులు అన్న మంత్రి లోకేష్**

**విజయనగరం-సూర్య వాస్తవం**



ఎర్ర బస్సు కూడా రాని చోటుకు ఎయిర్‌బస్ అవసరమా? అని ఎగతాళి చేసిన చోటే ఇప్పుడు విమానాశ్రయం వచ్చిందని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గతంలో కొందరు ఉత్తరాంధ్రను తక్కువగా చూసి, ఇక్కడి ప్రజలను అవమానించారని ఆయన విమర్శించారు. "ఎర్ర బస్సు రాదన్నచోట ఎయిర్‌పోర్టు వచ్చింది, మన ప్రధాని మోదీ వచ్చారు. ఇదే మన ఉత్తరాంధ్ర దెబ్బ, అర్థమైందా రాజా!" అంటూ ప్రత్యర్థులను ఉద్దేశించి పదునైన వ్యాఖ్యలు చేశారు. ఉత్తరాంధ్ర కలలకు ప్రధాని నరేంద్ర మోదీ రెక్కలు తొడిగారని లోకేశ్ కొనియాడారు. ప్రధాని సహకారంతోనే ఆంధ్రప్రదేశ్‌లో అనేక అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి ఆయన పూర్తి మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. నమో అంటే.. హిమ్మత్ (ధైర్యం), విశ్వాస్ (నమ్మకం), సురక్షిత్ భారత్ (సురక్షిత భారతం) అని ఆయన వివరించారు. సహజ వనరులు సమృద్ధిగా ఉన్న ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ విమానాశ్రయం కీలకం కానుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ ఎయిర్‌పోర్టు రాష్ట్రానికి ఒక పవర్ ఇంజిన్‌గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. విమానాశ్రయాన్ని వేగంగా నిర్మించిన జీఎంఆర్ సంస్థను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## నీట్ యూజీ 2026
## ఆగస్టు 4 నుంచి
# కౌన్సెలింగ్ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

17 వరకు జరుగుతుంది. ఈ రౌండ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు ఆగస్టు 22వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. ఆగస్టు 23న వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుంది. ఇక రాష్ట్రాల కోటా మొదటి రౌండ్ కౌన్సెలింగ్ ఆగస్టు 13 నుంచి 22 వరకు నిర్వహిస్తారు. రెండో రౌండ్ కౌన్సిలింగ్ విషయానికి వస్తే, ఆల్ ఇండియా కోటా ప్రక్రియ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 2 వరకు, రాష్ట్రాల కోటా కౌన్సెలింగ్ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 8 వరకు కొనసాగుతుంది.

నిర్దేశిత షెడ్యూల్‌ను సకాలంలో పూర్తి చేసేలా శని, ఆదివారాలు మరియు ఇతర సెలవు దినాల్లోనూ పనిచేయాలని అన్ని మెడికల్ కాలేజీలను ఎన్‌టీఏ ఆదేశించింది. తదుపరి రౌండ్లు, స్ట్రే వేకెన్సీలతో కలిపి అక్టోబర్ 10 నాటికి ప్రవేశాల ప్రక్రియను సంపూర్ణంగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో మే 3న జరిగిన పరీక్షను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత ప్రభుత్వం 47 మంది ఎన్‌టీఏ అధికారులను విధుల నుంచి తొలగించి, చట్టపరమైన చర్యలు చేపట్టింది. అనంతరం నిర్వహించిన రీ-టెస్ట్ ఫలితాలను జులై 16న ప్రకటించారు. ఈ క్రమంలోనే తాజాగా కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది.

## నల్ల చెరువు పునరుజ్జీవంలో
# హైడ్రా అహర్నిశలు కృషి

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే కాదనీ, భావి తరాల భవిష్యత్తును భద్రపరచడం కూడా అని పేర్కొన్నారు. ప్రతి చెరువును కాపాడుతూ... ప్రజల ఆస్తిని సంరక్షిస్తూ ముందుకు సాగుతామని ఆయన భరోసా ఇచ్చారు. కొత్త శిఖరాలను అధిరోహిస్తున్న తెలంగాణరాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ కొత్త శిఖరాలను అధిరోహిస్తూ సరికొత్త విజయాలను సాధిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ పని తీరును ప్రదర్శిస్తోందని ట్వీట్ ద్వారా తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో తలసరి ఆదాయం రూ. 4,18,931గా నమోదయ్యిందనీ, ఇది గతేడాది రూ. 3,80,031గా ఉందని గుర్తు చేశారు. ఒకే సంవత్సరంలో తాము 10.23 శాతం వృద్ధిని సాధించామనీ, ఇది రూ. 38,900 పెరుగుదల అని తెలిపారు. కఠోర శ్రమ, ఆర్థిక వృద్ధిపై దృష్టి, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, అన్ని రంగాలలో సమతుల్య అభివృద్ధి, తాత్కాలిక విధానాల నుంచి విధాన ఆధారిత పాలనకు మారడం, శ్రద్ధతో కూడిన పని, నిరంతర సమీక్షలు, వివరాలపై శ్రద్ధ, భాగస్వాములతో నిరంతరం సంప్రదింపులు చేయడం ద్వారా ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం... గత దశాబ్ద కాలపు వైఫల్య పాలనను, నిరాశావాద వాతావరణాన్ని తిప్పికొట్టి, ప్రతి పౌరునిలో ఆశావాదాన్ని, నమ్మకాన్ని నింపిందని వివరించారు. తమ విజయానికి మహిళలు, రైతులు, యువత అతిపెద్ద లబ్దిదారులని తెలిపారు. రాబోయే కాలంలో రాష్ట్రం మరింత గొప్ప విజయాలను సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## భోగాపురం ఎయిర్ పోర్టు
# క్రెడిట్ వార్..

**- ప్రాజెక్టుకు పునాది వేసింది జగనే అన్న వైసీపీ**

**- అన్ని అనుమతులు జగన్ హయాంలోనే సాధించామని వెల్లడి**

**- ప్రాజెక్టు విజయంలో చంద్రబాబు పాత్ర లేదన్న వైసీపీ**

**అమరావతి - సూర్య వాస్తవం**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఇవాళ ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభమయింది. మరోవైపు, ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవంపై వైసీపీ ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. భోగాపురం ఎయిర్‌పోర్టు సాకారమవ్వడంపై మాజీ సీఎం జగన్ తరఫున ప్రజలకు వైసీపీ ధన్యవాదాలు తెలిపింది. ఈ ప్రాజెక్టుకు పునాది వేసి, కల నుంచి నిజం దిశగా నడిపించిన నాయకుడు ఎవరో రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా తెలుసని పేర్కొంది. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి నాయకులు ఎలాంటి పాత్ర లేకుండానే మొత్తం క్రెడిట్ వారి ఖాతాలో వేసుకునేందుకు తాపత్రయపడుతున్నారని తీవ్రంగా ఆరోపించింది.

జగన్ ప్రభుత్వం ఉన్న సమయంలోనే ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం రూ.1,200 కోట్లు ఖర్చు చేసి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేశామని తెలిపింది. నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లించడంలో తమ ప్రభుత్వమే ముందడుగు వేసిందని స్పష్టం చేసింది. ప్రాజెక్టుకు అవసరమైన అన్ని రకాల కీలక పర్యావరణ, విమానయాన అనుమతులను జగన్ హయాంలోనే వేగవంతంగా సాధించామని తెలిపింది. ఎయిర్‌పోర్టు అనుసంధానతకు అవసరమైన రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు నాటి జగన్ ప్రభుత్వమే శ్రీకారం చుట్టిందని, అందువల్ల ఈ ప్రాజెక్టు విజయంలో చంద్రబాబు పాత్ర ఏమీ లేదని విమర్శించింది.

## మధ్యవర్తిత్వం భారత
## నాగరికతలోనే ఉంది

(మొదటిపేజీ తరువాయి)

అభిప్రాయపడ్డారు. జైపూర్‌లో నిర్వహిస్తున్న కామన్వెల్త్ మధ్యవర్తిత్వ సదస్సు రెండో రోజైన శనివారం ఆయన ప్రసంగించారు. 2023లో మధ్యవర్తిత్వ చట్టం అమల్లోకి రాకముందు నుంచే మన సంస్కృతిలో ఈ విధానం ప్రాచుర్యంలో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో శాసన, న్యాయవ్యవస్థలు ఈ పద్ధతిని మరింత బలోపేతం చేశాయని తెలిపారు. ఈ సందర్భంగా ఒక నారింజ పండు కోసం వివాదానికి దిగిన ఇద్దరు సోదరీమణుల కథను ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. ఒకరికి పండు గుజ్జు, మరొకరికి తొక్క అవసరమైనప్పటికీ, ఆ విషయం స్పష్టంగా మాట్లాడుకోకపోవడంతో వారు పండును చెరిసగం పంచుకున్నారని, ముందే తమ అవసరాల గురించి చర్చించుకుని ఉంటే ఇద్దరికీ పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరేదని వివరించారు. మన ప్రాచీన గ్రంథాలైన వేదాలు, రామాయణం, మహాభారతాల్లోనూ మధ్యవర్తిత్వానికి సంబంధించిన అనేక అంశాలు ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో పేర్కొన్న సామ, దాన, భేద, దండోపాయం అనే నాలుగు పాలనా పద్ధతుల్లో మొదటిదైన 'సామ' నుంచే ఆధునిక మధ్యవర్తిత్వం ఉద్భవించిందని విశ్లేషించారు.

# సంపాదకీయం

## సీజేపీ సైలెంట్ ఉద్యమం




నీట్ పేపర్ లీకేజీ, విద్యా వ్యవస్థలోని లోపాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నడిపిన ఉద్యమం ఇటీవల దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఉద్యమం పైకి ఆగినట్లు కనిపించినా, విశ్లేషకులు దీన్ని కేవలం తాత్కాలిక ఎత్తుగడగా చూస్తున్నారు. సీజేపీ ఇప్పుడు వ్యవస్థలో నిలబడి, ఎన్నికల్లో పోటీ చేసి, బీజేపీకి వ్యతిరేకంగా విస్తృత కూటమి నిర్మించాలని ప్రయత్నిస్తోందని తెలుస్తోంది. విద్యార్థుల నిరసనలు మంత్రి రాజీనామాకు దారితీశాయి. ఇది ఉద్యమకారులకు తక్షణ విజయంగా కనిపించినా, సీజేపీకి అసలు లక్ష్యం అంతకు మించినదని స్పష్టమవుతోంది. రాజీనామా తర్వాత ప్రధాన ఇష్యూ కనుమరుగైంది. విద్యార్థులపై అనేక కేసులు నమోదయ్యాయి. దాడులు, రాళ్లు విసిరినవారిని గుర్తించడంతో పలువురు మళ్లీ ఉద్యమానికి రావడం కష్టమైంది. ఫలితంగా బహిరంగ నిరసనలు ఆగిపోయాయి. అయినా సీజేపీ సీనియర్ కార్యకర్తల కార్యకలాపాలు ఆగలేదు. వారు వివిధ వ్యక్తులను కలుస్తూ, వ్యూహాలు రూపొందిస్తున్నారు. సీజేపీలో అశుతోష్ రాంకా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆప్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న ఈయన ఇప్పుడు సీజేపీలో ప్రముఖంగా కనిపిస్తున్నారు. దీపికా బలీయ కూడా ముందుకు వచ్చారు. జాట్ సమాజానికి చెందిన ఈ మహిళా నేత ఇటీవల సంయుక్త కిసాన్ మోర్చా సమావేశానికి హాజరై కేంద్ర వ్యతిరేక స్వరం వినిపించారు. అక్కడే రైతు నేత రాకేశ్ టికాయత్‌ను కలిశారు. 2020?21 రైతు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన టికాయత్‌తో సంపర్కాలు సీజేపీకి రైతు శక్తిని చేర్చుకునే అవకాశం కల్పిస్తున్నాయి. అంతకుముందు సమాజ్‌వాదీ పార్టీ నేతలు, ఆజాద్ సమాజ్ పార్టీ, ఆప్ నాయకులతోనూ చర్చలు జరిగాయి. యాంటీ బీజేపీ కూటమిని ఏర్పాటు చేసి ఏకీకృత పోరాటం చేయాలనే లక్ష్యంతో ఈ భేటీలు సాగుతున్నాయి. రాకేశ్ టికాయత్‌కు ఉత్తరప్రదేశ్ జాట్ సమాజంలో పట్టు ఉంది. అజీత్‌సింగ్, హరియాణాలోని ఓం ప్రకాశ్ చౌతాల కుటుంబం వంటి జాట్ నాయకులతో కలిసి కూటమి ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. యూపీలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జాట్ ఓట్లను బీజేపీ నుంచి దూరం చేయడమే లక్ష్యం. 2021?22 రైతు ఉద్యమంలో ఢిల్లీకి వచ్చే రోడ్లు దిగ్బంధించిన అనుభవాన్ని సీజేపీ ఉపయోగించుకోవాలని చూస్తోంది. అప్పటి సంఘటనల్లో ఎర్రకోట వద్ద జరిగిన కొన్ని సంఘటనలు, ఒక ఉద్యమకారుడి మరణం వంటివి ఇప్పటికీ చర్చనీయాంశాలే. అయితే ప్రస్తుతం సీజేపీ మరింత విస్తృత బేస్ నిర్మించడంపై దృష్టి సారించింది. విద్యార్థుల్లోని యాంటీ మోదీ సెంటిమెంట్‌ను రైతు సంఘాలు, విపక్షాలతో కలిపి యూపీ, గుజరాత్, గోవా వంటి రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీని సవాలు చేయాలని భావిస్తోంది. ప్రాంతీయ పార్టీలకు లబ్ధి చేకూర్చే వ్యూహాలు రూపొందుతున్నాయి. కాంగ్రెస్ కూడా సీజేపీతో సఖ్యతగా వ్యవహరిస్తూ ప్రోత్సహిస్తోంది. మంత్రి రాజీనామాతో సీజేపీకి స్పష్టమైన విజయంగా చెప్పుకునే అవకాశం తగ్గింది. విద్యార్థుల ఉద్యమం ఆగిపోవడం, కేసులు నమోదు కావడం పెద్ద సవాళ్లు. అయినా సైలెంట్‌గా సాగుతున్న ప్రయత్నాలు, కీలక నేతల సంపర్కాలు చూస్తే ఉద్యమం పూర్తిగా ఆగిపోలేదని స్పష్టం. కొంతమంది జంతర్‌మందతర్ ఉద్యమం వద్ద రీల్స్ చేయడం ద్వారా ఫాలోవర్ల సంఖ్య పెంచుకున్నారు. ఓ మైనర్‌కు ఇన్‌స్టాలో మొదట 5 వేల మంది ఫాలోవర్లు ఉండేవారట. జంతర్‌మంతర్ వద్ద రీల్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో అతని ఫాలోవర్లు 7.5 లక్షలకు పెరిగారట. ఫాలోవర్ల పెరుగుదలతో కొందరు కొత్త ఫోన్ కొనుక్కుని అక్కడే విజయం సాధించానని చెప్పుకున్నారు. ఇలాంటి సంఘటనలు ఉద్యమం కంటే వ్యక్తిగత ప్రచారం, కంటెంట్ సృష్టి మీద దృష్టి పెట్టినట్లు అనిపిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు యువతను ఆకర్షించి, వారిని వేదిక వద్దకు తీసుకువచ్చే శక్తిగా మారాయి. కొంతమంది దూషించి, ద్వేషపూరిత వ్యాఖ్యలతో రీల్స్ చేసి ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. అయినా కొందరు లబ్ధి పొందినట్లు కనిపిస్తోంది. ఇలాంటి విధానం ఉద్యమం యొక్క అసలు ఉద్దేశాన్ని దెబ్బతీస్తుంది. సానుకూలంగా, నిజమైన సమస్యలపై అవగాహన కల్పించే రీల్స్ చేస్తే మంచిది కానీ, ద్వేషం, తిట్లు ద్వారా దష్టి సాధించే ప్రయత్నాలు ప్రజా మద్దతును బలహీనపరుస్తాయి. తాజా జంతర్‌మంతర్ రీల్స్ ఇన్‌స్టా బేస్డ్ హెజిటేషన్ అనే ధోరణిని సూచిస్తున్నాయి. అంటే సామాజిక మాధ్యమాల్లో కనిపించే విధంగా, లైక్‌లు, ఫాలోవర్లు పెరగాలనే ఆలోచనతోనే చాలామంది పాల్గొంటున్నారు. నిజమైన సమస్యలపై పోరాటం కంటే వైరల్ కంటెంట్ సృష్టి ప్రధానమైపోతే ఉద్యమం బలహీనపడుతుంది. అదే సమయంలో సామాజిక మాధ్యమాలు సమాచారం వ్యాప్తి చేయడంలో, యువతను సమీకరించడంలో సహాయపడతాయి జంతర్ మంతర్ వద్ద జరిగిన ఈ ఉద్యమంలో రీల్స్ పాత్ర కీలకంగా కనిపిస్తోంది. సామాజిక మాధ్యమాలు ఆధునిక ప్రజా ఉద్యమాల ఆకారం మార్చేస్తున్నాయి. అయితే వాటిని సానుకూలంగా, నిజాయితీగా ఉపయోగిస్తేనే అసలు లక్ష్యాలు నెరవేరుతాయి. రాజకీయాల్లో బలమైన శక్తిగా మారాలనే లక్ష్యంతో సీజేపీ కదులుతోంది. ఈ ప్రయత్నాలు ఎంతవరకు విజయవంతం అవుతాయో, యాంటీ బీజేపీ ఫ్రంట్ ఎలా రూపుదిద్దు కుంటుందో రాబోయే నెలల్లోనే స్పష్టమవుతుంది.



# మంత్రి గారూ.. జర ఇటు చూడరూ..!

ఫైల్ ఫోటో

- ఆరోగ్య మంత్రి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రి దుస్థితి
- వరుస ఘటనలతో ఆసుపత్రి నిర్వహణపై విమర్శలు.. అధికారుల నిర్లక్ష్యంపై ప్రశ్నలు
- స్ట్రెచర్లు లేక చేతులపై రోగుల తరలింపు.. ప్రభుత్వ ఆసుపత్రి సేవలపై అసంతృప్తి
- ఒకే వారంలో వరుస ఘటనలు.. ప్రభుత్వ ఆసుపత్రి పనితీరుపై తీవ్ర చర్చ
- అనంత హ్యూమన్ మిల్క్ బ్యాంక్ నిర్వహణపై కూడా పలు ఆరోపణలు
- శభాష్..ఏఎంసీ ! గుట్టుచప్పుడు కాకుండా మళ్లీ బయోమెడికల్ వ్యర్థాల తరలింపు



ఫైల్ ఫోటో

అనంతపురం వైద్యం – సూర్య వాస్తవం : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వరుసగా చోటు చేసుకుంటున్న ఘటనలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆసుపత్రి నిర్వహణ, మౌలిక వసతులు, భద్రతా చర్యలపై ప్రజలు, రోగుల బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, కొన్ని రోజుల క్రితం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ భవాని రవికుమార్ తదితరులు ఆసుపత్రిలో పరిశుభ్రత, సేవలపై సమీక్ష నిర్వహించి హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, పరిస్థితుల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మెడికల్ ఇటీవలి రోజుల్లో ఆసుపత్రిలో జరిగిన పలు సంఘటనలు ప్రజల్లో ఆందోళనకు కారణమయ్యాయి. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయినట్లు వినిపించాయి అలాగే స్ట్రెచర్లు అందుబాటులో లేకపోవడంతో రోగులను వారి బంధువులు చేతుల మీద మోసుకుంటూ వార్డులకు తరలించాల్సిన పరిస్థితులుఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గత రెండు, మూడు నెలలుగా స్ట్రెచర్లు, వీల్‌చైర్ల కొరత సమస్య కొనసాగుతోందని, అత్యవసర వైద్య సేవలకు ఇది తీవ్ర అంతరాయం కలిగిస్తోందని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా అత్యవసర విభాగంలో స్ట్రెచర్లు, వీల్‌చైర్లు తగిన సంఖ్యలో లేవు. ఉన్న వాటిని సిబ్బంది మెడికల్ వేస్ట్ తీసికెళ్ళడానికి ఇతర పనులకి వాడుతున్నారు. వీటి గురుంచి మీడియాలో ఎన్నిసార్లు కథనాలు వచ్చినా ఎమ్మెల్యే, కలెక్టర్, హెచ్చరించిన సిబ్బంది తిరుపతి మారడం లేదు. అలాగే బెడ్స్ కొరత వల్ల ఒకటి బెడ్ పై ఇద్దరు రోగులకు వైద్యం చేస్తున్నారు. తగినన్ని బెడ్స్ స్ట్రెచర్లు, వీల్‌చైర్లు అందుబాటులో ఉంచి, రోగులకు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు. అయితే, ఈ ఘటనలు మరియు ఆరోపణలపై ఆసుపత్రి యాజమాన్యం లేదా సంబంధిత అధికారుల నుంచి అధికారిక వివరణ ఇంకా వెలువడలేదు. సంఘటనలపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెల్లడించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు, రోగుల బంధువులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### గత 20 రోజులుగా ఎక్స్‌రే పనిచేయడం లేదని సమాచారం

గత 20 రోజులుగా ఎక్స్‌రే యంత్రం ప్యానెల్ బోర్డు సమస్య కారణంగా పనిచేయకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాచారం. ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో ఆసుపత్రిలో ఆర్‌ఎంఓ, ఓ విభాగాధిపతి (హెచ్‌వోడీ) మధ్య జరిగిన వాగ్వాదం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పరిపాలనా అధికారాల విషయంలో విభేదాలు తలెత్తినట్లు సమాచారం. ఈ ఘటన ఆసుపత్రి వర్గాల్లో చర్చకు దారితీసింది. మరో వైపు ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అనంత హ్యూమన్ మిల్క్ బ్యాంక్ నిర్వహణపై కూడా పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాతలు అందించిన సామగ్రి వినియోగం, నిధుల నిర్వహణ, సేవల అమలులో పారదర్శకత లేదని కొందరు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల అధికారిక స్పందన ఇంకా వెలువడలేదు. అలాగే ప్రజాధనం సమర్థంగా వినియోగించలేదని విమర్శలు వినిపిస్తున్న నేపథ్యంలో దీనిపై కూడా విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చోటుచేసుకున్న అన్ని అంశాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు, రోగులు, సామాజిక వర్గాలు కోరుతున్నాయి.

### శభాష్..ఏఎంసీ ! గుట్టుచప్పుడు కాకుండా మళ్లీ బయోమెడికల్ వ్యర్థాల తరలింపు..! అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నుంచి దంప్‌యార్డుకు ఏఎంసీ ట్రాక్టర్ల ద్వారా తరలింపు ఆరోపణలు

అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నుంచి బయోమెడికల్ వ్యర్థాలను ఏఎంసీ ట్రాక్టర్ల ద్వారా దంప్‌యార్డుకు మళ్లీ తరలించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చీకటి పడిన తర్వాత పక్కా ప్రణాళికతో ఈ తరలింపు చేపట్టినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులను ప్రశ్నించగా, స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా పొంతనలేని వివరణలు ఇస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, సేకరణ, రవాణా, శాస్త్రీయ విధానంలో నిర్వీర్యం వంటి అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. అసలు ఆసుపత్రి నుంచి ఏ రకమైన వ్యర్థాలను, ఎక్కడికి, ఎవరి అనుమతితో తరలించారు? ఏఎంసీ ట్రాక్టర్లను ఎందుకు వినియోగించారు? నిబంధనల ప్రకారమే ఈ తరలింపు జరిగిందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలను ప్రజలకు వెల్లడించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.








ఫైల్ ఫోటోలు

# రెవెన్యూ క్లినిక్‌కు 118 అర్జీలు.. 49 పరిష్కారం

**- లింక్ పత్రాలు సమర్పిస్తే భూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం: తహసీల్దారు బ్రహ్మయ్య**

**కణేకల్ – సూర్య వాస్తవం:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కణేకల్ మండలంలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్ కార్యక్రమానికి ప్రజల నుంచి మొత్తం 118 అర్జీలు అందాయి. వీటిలో 49 అర్జీలను పరిష్కరించగా, 8 అర్జీలు తిరస్కరించారు. మరో 61 అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్లు తహసీల్దారు బ్రహ్మయ్య తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వాటిలో 33 అర్జీలు క్షేత్రస్థాయి విచారణలో ఉండగా, 28 అర్జీలు ఆర్‌ఓఆర్ చట్టం ప్రకారం విచారణలో ఉన్నాయని పేర్కొన్నారు. వీటిలో సుమారు 20 అర్జీలకు సంబంధించిన లింక్ పత్రాలు సమర్పించేందుకు అర్జీదారులకు గడువు ఇచ్చినట్లు వివరించారు. రెవెన్యూ క్లినిక్‌లో అందిన ప్రతి అర్జీని అంకితభావంతో పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ రికార్డులు, లింక్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు, అవసరమైతే ప్రత్యర్థులకు నోటీసులు జారీ చేసి, తహసీల్దారు స్వయంగా విచారణ చేపట్టి తుది ఉత్తర్వులు లేదా ఎండార్స్‌మెంట్‌లు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. భూ వివాదాలు, రీసర్వే అభ్యంతరాలకు సంబంధించిన అర్జీలు సమర్పించే వారు ఆర్‌హెచ్ , మాన్యువల్ ఈసీ, ఆన్‌లైన్ ఈసీతో పాటు సంబంధిత లింక్ పత్రాలు తప్పనిసరిగా జతచేయాలని సూచించారు. పూర్తి పత్రాలు సమర్పిస్తే భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తహసీల్దారు తెలిపారు.



# గ్రామీణ భారత్‌కు 'మనోబంధు' మానవీయ నమూనా

- గ్రామీణ ప్రాంతాల్లో మానసిక ఆరోగ్య సేవల విస్తరణకు డా.అఖిల మిత్ర పిలుపు
- గృహరహిత మానసిక రోగులకు ఉచిత రక్షణ, చికిత్స, పునరావాస సేవలు
- ఐదేళ్లుగా నిరంతర సేవలందిస్తున్న మనోబంధు పునరావాస ఫౌండేషన్



**అనంతపురం వైద్యం –సూర్య వాస్తవం:** భారత గ్రామీణ ప్రాంతాల్లో వరదలు, తుఫానులు, కరువు లేదా ఆకస్మిక ఆర్థిక సంక్షోభాలు సంభవించినప్పుడు నష్టం కేవలం కూలిపోయిన ఇళ్లు, కోల్పోయిన జీవనోపాధితోనే ముగియదని నిపుణులు పేర్కొన్నారు. ఆందోళన, తీవ్ర దుఃఖం, మానసిక గాయం, డిప్రెషన్ వంటి కనిపించని సమస్యలు భౌతిక పునర్నిర్మాణం పూర్తైన తర్వాత కూడా చాలా కాలం ప్రజలను ప్రభావితం చేస్తాయని తెలిపారు. అందువల్ల సంక్షోభ సమయాల్లో మానసిక ఆరోగ్య సహాయం విలాసం కాదని, అది అత్యవసర ప్రజారోగ్య సేవ అని స్పష్టం చేశారు.మనోబంధు అంబులెన్స్ సేవలను ప్రారంభించిన సందర్భంగా లయన్స్ క్లబ్ గవర్నర్ డా. ఎం. విరుపాక్షరెడ్డి మాట్లాడుతూ, "సేవలకు ప్రాప్యత––విపత్తులు, అత్యవసర పరిస్థితులు" అనే అంశంపై జరిగిన చర్చల్లో గ్రామీణ భారతదేశంలో మానసిక ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.ప్రకృతి వైద్యురాలు, ప్రజారోగ్య నిపుణురాలు డా. అఖిల మిత్ర మాట్లాడుతూ, "సంక్షోభ సమయంలో మానసిక ఆరోగ్య సహాయం ఆహారం, నీరు, ఆశ్రయం ఎంత అవసరమో విపత్తు ఒక గ్రామాన్ని తాకినప్పుడు ఇళ్లు మాత్రమే కూలవు ప్రజల మనసుల్లోనూ ఒక మౌన తుఫాను మొదలవుతుంది. గ్రామీణ భారతదేశంలో చికిత్స ఆసుపత్రిలో కాదు, మనుషుల మధ్య అనుబంధంతో ప్రారంభమవుతుంది" అని అన్నారు. గత ఐదేళ్లకు పైగా మనోబంధు పునరావాస ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్‌లోని వీధుల్లో తిరుగుతున్న గృహరహిత మానసిక రోగులను రక్షించి, వారికి చికిత్స అందిస్తూ పునరావాసం కల్పిస్తోంది. అనంతరం వారి కుటుంబ సభ్యులను గుర్తించి, వారితో తిరిగి కలిపే సేవలను నిరంతరం కొనసాగిస్తోంది. గ్రామీణ భారతదేశంలో మానసిక ఆరోగ్య సేవలు ఇప్పటికీ తీవ్ర కొరతలోనే ఉన్నాయని నిపుణులు తెలిపారు.

మానసిక వైద్యులు ప్రధానంగా జిల్లా కేంద్రాలకే పరిమితం కావడంతో గ్రామీణ ప్రజలు చికిత్స కోసం దూర ప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తోందన్నారు. రవాణా సమస్యలు, ఆసుపత్రులపై అధిక భారం, మానసిక సమస్యలపై ఉన్న సామాజిక ముద్ర కారణంగా అనేక మంది సమయానికి చికిత్స పొందలేక పోతున్నారని పేర్కొన్నారు. సేవలు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో కూడా స్థానిక భాష, సంస్కృతికి అనుగుణంగా సేవలు లేకపోవడం మరో సమస్యగా మారిందన్నారు. దీంతో గ్రామాల్లో మానసిక సమస్యలను తొలుత గుర్తించేది వైద్యులు కాకుండా పొరుగువారు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలేనని తెలిపారు. "ఈ నమ్మకమైన వ్యక్తులే గ్రామీణ మానసిక ఆరోగ్య భద్రతా వ్యవస్థకు పునాది" అని డా. ముచ్చుకోట సురేష్‌బాబు, ఎస్. కృష్ణారెడ్డి పేర్కొన్నారు.గృహ రహిత మానసిక రోగులను రక్షించి, వారికి ఆశ్రయం, ఆహారం, వైద్య చికిత్స, పునరావాసం కల్పించి, వారి కుటుంబాలతో తిరిగి కలిపే సేవలను మనోబంధు పునరావాస ఫౌండేషన్ పూర్తిగా ఉచితంగా అందిస్తోందని యంగ్ ఇండియా నిర్వాహకురాలు సోనియా బేడీ తెలిపారు. ఈ సేవలు దేశవ్యాప్తంగా ఆదర్శ నమూనాగా నిలుస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.డా. ఉద్దండం చంద్రశేఖర్ మాట్లాడుతూ, "మానసిక వ్యాధి అత్యంత ప్రతిభావంతులనూ సమాజానికి దూరం చేయగలదు. మా లక్ష్యం కేవలం చికిత్స అందించడం మాత్రమే కాదు; వారి గౌరవాన్ని, కుటుంబాన్ని, జీవితాన్ని తిరిగి అందించడం" అని అన్నారు. ఫౌండేషన్ ఇప్పటికే వందలాది కుటుంబ పునర్మిళనాలను విజయవంతంగా నిర్వహించింది. ప్రభుత్వం, పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ స్థాయి కమ్యూనిటీ నెట్‌వర్క్‌లు సమన్వయంతో పనిచేస్తే ఈ నమూనాను దేశవ్యాప్తంగా విస్తరించవచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు.

వాతావరణ మార్పులు, ప్రకృతి విపత్తులు, ఆర్థిక అస్థిరతలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో భారతదేశ మానసిక ఆరోగ్య విధానం ఆసుపత్రులకే పరిమితం కాకూడదని ప్రాంతీయ సమన్వయకర్త లయన్ బాయినేని నాగేంద్ర ప్రసాద్, ఎం. శశికళ తదితరులు పేర్కొన్నారు. గ్రామీణ సమాజంలో అనురాగం, కరుణ, పరస్పర సహకారం, సామూహిక సంరక్షణ వంటి విలువలే అత్యంత ప్రభావవంతమైన మానసిక ఆరోగ్య సహాయక శక్తులని మనోబంధు సేవలు నిరూపిస్తున్నాయని తెలిపారు.

# జిల్లా వ్యాప్తంగా "ఆపరేషన్ నైట్ సేఫ్టీ"

- ఎస్పీ పి. జగదీష్ ఆదేశాలతో ప్రత్యేక తనిఖీలు
- శాంతిభద్రతల పరిరక్షణ, రాత్రి వేళల్లో ప్రజల భద్రతే లక్ష్యం
- అనుమానితులు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం:** జిల్లాలో నేరాల నియంత్రణ, రాత్రి వేళల్లో ప్రజల భద్రతను పటిష్టం చేయడం, శాంతిభద్రతలను పరిరక్షించడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేకంగా "ఆపరేషన్ నైట్ సేఫ్టీ" కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాలు, పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా ఒకే సమయంలో విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లాలోని ప్రధాన జంక్షన్లు, అంతర్రాష్ట్ర, అంతర్జిల్లా సరిహద్దులు, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రాత్రి వేళల్లో అకారణంగా సంచరిస్తున్న అనుమానితులు, పాత నేరస్తులను గుర్తించి విచారించారు.రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. జిల్లా పరిధిలోని లాడ్జిలు, హోటళ్లు, ధాబాలను తనిఖీ చేసి, సరైన గుర్తింపు పత్రాలు లేకుండా ఎవరికీ గదులు కేటాయించవద్దని నిర్వాహకులను హెచ్చరించారు.బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, నిర్మానుష్య ప్రాంతాల్లో రాత్రిపూట ప్రయాణించే వారి భద్రత కోసం పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ప్రజల ప్రాణ, ఆస్తుల భద్రతకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని, నేరాల నియంత్రణ కోసం ఇటువంటి "ఆపరేషన్ నైట్ సేఫ్టీ" నైట్ సేఫ్టీ తనిఖీలు ఇకపై కూడా నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. రాత్రి వేళల్లో అకారణంగా సంచరిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## ఉపాధి హామీ పథకం పనులలో పరిశీలిస్తున్న (ఎంపిడిఓ ప్రభాకర్)



**పామిడి–సూర్య వాస్తవం :** పామిడి మండలంలోని నెమళ్ళపల్లి గ్రామం పరిసర ప్రాంతాలలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పనులను శనివారం ఎంపీడీవో డి.ప్రభాకర్ పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం పనులు గ్రామానికి, గ్రామం పరిసర ప్రాంతానికి నాణ్యత మైన ఉపయోగకరంగా ఉండవలెనని, జాబ్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తులు పనులలో పాల్గొనాలని గతంలో మాదిరి అవకతవకలు జరగడానికి వీలులేదని, ప్రతిరోజు పలువుల దినాలలో జాబ్ కార్డ్ వ్యక్తులు పనిచేసే ప్రాంతంలో (లోకేషన్) ఫోటో దిగాలని, అక్కడ తమ్ము వేయాలని, లేనియెడల బిల్లులు మంజూరు కావని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, జాబ్ కార్డ్ దారులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికులకు ప్రతి నెల రూ.2వేలు వితరణ



**గార్లదిన్నె- సూర్య వాస్తవం:** గార్లదిన్నె మండలం పరిధిలోని కల్లూరు ఆర్ఎస్ గ్రామపంచాయతీ కార్మికులకు ప్రతినెల 1వ తేదీన క్రమం తప్పకుండా 24వ విడతగా 2,000 రూపాయలను ఎగువపల్లికి చెందిన సింహ (సింహసేన) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సింహ మాట్లాడుతూ పంటలు పండించే మన ఇంటిలోని పశువుల పేడను, ఇంటి ముందు ఉన్న కసువును శుభ్రపరచుకోలేము కానీ పంచాయతీ కార్మిక సోదర సోదరీమణులు వారి వారి ఆరోగ్యాలను లెక్కచేయక గ్రామంలోని వీధులను రహదారులను ఊర్చి, డ్రైనేజీలలో ఉన్న గలీజ్ గల తడి పొడి చెత్తను ఎత్తివేయడం వాటిని గ్రామానికి దూరంగా (పడిపోడి చెత్తకేంద్రం)డంపింగ్ యాడ్ కు తరలించడం గ్రామాన్ని పరిశుభ్రముగా దుర్గంధపు వాసన లేకుండా ఉంచడం వల్ల ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో నివసిస్తున్నామని, ప్రభుత్వం వారికిచ్చే జీతం చాలా తక్కువని, నా కష్టార్జితమైన సొమ్ములో ప్రతినెల ప్రజాసేవలో భాగంగా మానవతా దృక్పదముతో క్రమం తప్పకుండా 2000 రూపాయలను వితరణగా ప్రతినెలా 1వ తేదీన క్రమం తప్పకుండా 24వ వినతగా పంపిణీ చేయడం జరిగిందన్నారు.

## అదనపు ఎస్పీగా పదోన్నతి పొందిన ఎస్. మహబూబ్ బాషాకు ఘన సన్మానం

- శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించిన ఎస్పీ
- ఉన్నత పదవిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష



**అనంతపురం క్రైమ్– సూర్య వాస్తవం :** చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా జిల్లా ఎస్పీ పి. జగదీష్ చేతుల మీదుగా సత్కారం విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించి అదనపు ఎస్పీగా పదోన్నతి పొందిన ఎస్. మహబూబ్ బాషా చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనను జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మహబూబ్ బాషా జిల్లాలో ఎంతో నిబద్ధతతో, అంకితభావంతో విధులు నిర్వహించి విశేష సేవలు అందించారని అభినందించారు. అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నత పదవిలోనూ మరిన్ని విజయాలు సాధించి, ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు అనంతరం జిల్లా ఎస్పీ పి. జగదీష్ మహబూబ్ బాషాకు శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి ఆత్మీయంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. నాగభూషణం, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ఐ పవన్ కుమార్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణతో పాటు పలువురు జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# పంటల బీమా ఎవరికోసం?

- ఉచిత బీమాను ఎత్తివేసిన కూటమి ప్రభుత్వం: వైసీపీ అధికార ప్రతినిధి కె.వి. రమణ విమర్శలు
- పంటతో పాటు ప్రీమియం భారం కూడా రైతులకే
- రాష్ట్ర ఖజానా నుంచి నేరుగా పంట నష్టపరిహారం చెల్లించిన వైఎస్సార్సీపీ
- ప్రభుత్వం ప్రతి ఎకరాకు రూ.10 వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్

**అనంతపురం సిటీ – సూర్య వాస్తవం :** "మెతుకు పట్టుకుంటేనే అన్నం ఉడికిందో లేదో తెలుస్తుంది. అలాగే ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేయగానే ఇది రైతుల ప్రభుత్వం కాదనే విషయం అర్థమైందని" వైఎస్సార్సీపీ రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కె.వి. రమణ విమర్శించారు.ఖరీఫ్ సాగు కోసం రైతులు అప్పులు చేసి భూమి చదును, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తదితర అవసరాలను సమకూర్చుకున్నారని తెలిపారు. ఇప్పటికే ఎకరాకు సుమారు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు, ఐదు ఎకరాలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారని పేర్కొన్నారు. అయితే ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా కొంతమంది రైతులు మాత్రమే విత్తనాలు వేయగలిగారని, మరికొందరు సాగు ప్రారంభించలేకపోయారని అన్నారు.కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమాను తొలగించి, ఆర్బీకేలలో కాకుండా బ్యాంకుల ద్వారా మాత్రమే ప్రీమియం చెల్లించాలనే నిబంధన విధించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. బ్యాంకుల చుట్టూ తిరిగినా సగం మందికి పైగా రైతులు ప్రీమియం చెల్లించలేకపోయారని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రీమియం చెల్లించిన రైతుల్లో కూడా పలువురు విత్తనాలు వేయలేకపోయారని, వేసిన పంటలు



ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రీమియం చెల్లించి పంట సాగు చేయలేని రైతులకు బీమా సంస్థలు ప్రీమియం సొమ్మును తిరిగి ఇవ్వడం లేదని ఆరోపించారు. దీంతో పంటల బీమా రైతుల నష్టపరిహారం కోసమా, లేక బీమా కంపెనీల లాభాల కోసమా అనే ప్రశ్న రైతుల్లో తలెత్తుతోందని అన్నారు.ఉచిత బీమా పథకాన్ని ఎత్తివేయడం వల్ల రైతులకు అటు పంట పెట్టుబడి, ఇటు బీమా ప్రీమియం భారం కలిగిందని విమర్శించారు. అత్యంత కరువు పీడిత ప్రాంతమైన రాయలసీమలో రైతులు ప్రీమియం చెల్లించేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రైతులు చెల్లించిన ప్రీమియం సొమ్ము బీమా కంపెనీలకు వెళుతున్నప్పటికీ, రైతులకు తగిన ప్రయోజనం అందడం లేదని ఆరోపించారు.ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో ఖరీఫ్ సీజన్ గడువు ముగిసిందని, రబీ పంటలకు గడువును 15 రోజులు పొడిగించినా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులకు పెద్దగా ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. వాతావరణ ఆధారిత బీమా పథకం రాయలసీమ వంటి వర్షాభావ ప్రాంతాలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడడం లేదని అభిప్రాయపడ్డారు.గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకం ద్వారా రైతులపై ప్రీమియం భారం లేకుండా చేసిందని, ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే అదే సీజన్‌లో రాష్ట్ర ఖజానా నుంచి నేరుగా నష్టపరిహారం చెల్లించిందని తెలిపారు. ప్రీమియం చెల్లింపు గడువును పొడిగించాలని కోరినా ప్రభుత్వం స్పందించలేదని అన్నారు.ఎల్‌నినో ప్రభావం రాయలసీమపై తీవ్రంగా ఉంటుందని పర్యావరణ శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని కె.వి. రమణ విమర్శించారు. రైతులు దుక్కి దున్నడం నుంచి పంట నూర్పిడి వరకు చేసిన మొత్తం ఖర్చును తిరిగి చెల్లించే విధంగా బీమా విధానంలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల బీమా విధానాన్ని పునఃసమీక్షించి, రైతుల తరఫున ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో పంటలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉన్నందున, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఎకరాకు రూ.10 వేల చొప్పున రాష్ట్ర ఖజానా నుంచి నేరుగా పంట నష్టపరిహారం చెల్లించాలని వైఎస్సార్సీపీ రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కె వి. రమణ డిమాండ్ చేశారు.

# డీఎస్సీ అక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించిన వై విశ్వేశ్వరరెడ్డి

- ఆగస్టు 4న రౌండ్ టేబుల్ సమావేశం 6 నుంచి 9 వరకు నిరసనలు
- ఆగస్టు 10న భారీ నిరసన ర్యాలీ నిర్వహణకు సన్నాహాలు
- డీఎస్సీ అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి
- విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి: విశ్వేశ్వరరెడ్డి



**ఉరవకొండ – సూర్య వాస్తవం :** డీఎస్సీ పరీక్షల నిర్వహణలో అవినీతి, అక్రమాలు, ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణలు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో పరీక్షల నిర్వహణ వంటి అంశాలపై సమగ్ర విచారణ జరపాలని వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. క్రీడాశాఖలో అర్హులైన వారికి అండగా నిలవాల్సిన బాధ్యత టీడీపీ ప్రభుత్వంపై ఉందన్నారు. డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని ఆయన కోరారు. వైసీపీ విద్యార్థి, యువజన సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డీఎస్సీ వ్యవహారంలో వెలువడుతున్న ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న మాట్లాడుతూ డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై వెంటనే విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశాడు. ఈ నెల 4వ తేదీన ఉరవకొండలో నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశం, ఆగస్టు 6 నుంచి 9వ తేదీ వరకు చేపట్టనున్న నిరసన కార్యక్రమాలు, అలాగే 10వ తేదీన నిర్వహించనున్న భారీ నిరసన ర్యాలీ విజయవంతంపై ఉరవకొండలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి మాట్లాడుతూ, డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్నట్లు ఆరోపిస్తున్న అక్రమాలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలను వెల్లడించాలని కోరారు. డీఎస్సీ అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని పేర్కొంటూ, ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సి పి వీరన్న, మంజునాథ్, రెడ్డి సాకే పురుషోత్తం,వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### - ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం





**పామిడి - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్ పిలుపు మేరకు పట్టణం 16వ వార్డ్ పాండు రంగ స్వామి వారి దేవాలయం నందు పేదల సేవలు ఎన్టీఆర్ భరోసా టెన్షన్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం ముందుగా పామిడి కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు అనంతరం పామిడి పట్టణం నందు పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశారు అలాగే కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలలో చేసిన అభివృద్ధి గురించి డోర్ టు డోర్ తిరిగి ప్రజలకు తెలియజేశారు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ప్రజా సంక్షేమం ప్రగతి బాట సూపర్ సిక్స్ పథకాల అమలు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఇంటికి సూపర్ సిక్స్ హామీలను ప్రాధాన్యత ప్రకారం పూర్తి చేస్తున్నాం అన్నారు. పెన్షన్ల పెంపు అవ్వాతాతలు వికలాంగులు, వితంతువుల గౌరవాన్ని పెంచుతూ పెన్షన్ మొత్తాన్ని పెంచి, ప్రతి నెల 1వ తేదీనే నేరుగా ఇంటి వద్దే అందిస్తున్నాం ?రైతన్నకు కొండంత అండ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సహాయం అందించడంతో పాటు, పంటలకు మద్దతు ధర కల్పిస్తూ రైతులకు అండగా నిలిచాం ?మహిళా సాధికారత మహాశక్తి కింద ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి మరియు ప్రతి ఇంటికి ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీతో మహిళల ఆర్థిక భారాన్ని తగ్గించాం ?యువతకు ఉపాధి ఉద్యోగాలు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి మెగా డీఎస్సీ తో పాటు జాబ్ క్యాలెండర్, పరిశ్రమల సాధన ద్వారా యువతకు విస్తృత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం తెలియజేశారు ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ మరియు మండల కూటమి నాయకులు కార్యకర్తలు మహిళల హాజరు కావడం జరిగింది.

## శ్రీ లక్ష్మి చెన్నకేశవ ఆలయా నిర్మాణానికి అన్ని విధాలుగా ఆదుకుంటాం

### - ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**పామిడి - సూర్య వాస్తవం :** పెన్నా నది ఒడ్డున వెలిసిన ప్రసిద్ధి చెందిన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయానికి దేవాదాయ శాఖ నుంచి రెండు కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి,ఇందులో సిజిఎఫ్ మ్యాచింగ్ గ్రాంటు 40 లక్షల రూపాయలు దేవాలయ కమిటీ మరియు ప్రజలు చెల్లించాల్సి ఉంటుంది కానీ మన గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీఆనం రామనారాయణ రెడ్డి దేవాదాయ శాఖ కమిషనర్ గారితో మాట్లాడి మ్యాచింగ్ గ్రాంట్ ను 40 లక్షల రూపాయల నుంచి 20 లక్షల రూపాయలకు తగ్గించి కేవలం 20 లక్షల రూపాయలు మాత్రమే చెల్లించేలాగా ఉత్తర్వులు మంజూరు చేయించినారు.ఈసందర్భంగా పామిడి పట్టణ ప్రజలు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కి హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు. ఆలయ కమిటీ సభ్యులుకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆలయ పునర్ నిర్మాణానికి అన్ని విధాలుగా సహకరిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఎన్.టి.ఆర్ భరోసా పింఛను పంపిణీలో పాలొన్న కమీషనర్ బి.జబ్బార్ మియా



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి అర్బన్ మున్సిపాలిటీ యందు పింఛను పంపిణీ కార్యక్ర మంలో భాగంగా ఈరోజు గుత్తి మున్సిపల్ పరిధిలో గల 25వార్డుల యందు సచివాలయ సిబ్బంది ద్వా రా ప్రజాప్రనిధులతో కలిసి ఇంటి వ ద్దకు వెళ్లి ఎన్.టి.ఆర్ భరోసా పింఛ ను పంపిణీ చేయడం జరిగిందని క మీషనర్ బి.జబ్బార్ మియా వివరా లు వెల్లడిస్తూ సాయంత్రం 5.30 గం టల సమయం రిపోర్టు ప్రకారం 43 42 పింఛన్లకు గాను 4125 పింఛన్లు 95% పంపిణీ చేయడం జరిగిందని మున్సిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా తెలిపారు.

## ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా

# జర్నలిస్టులకు ఇంటి స్థలాల హామీ నెరవేనా?.

**- జర్నలిస్టులు సమస్యలు పరిష్క రించాలని తహశీల్దార్ పుణ్యవతికి వినతి**



**గుత్తి - సూర్య వాస్తవం :**

గుత్తి పట్టణంలో జర్నలిస్టులు సమ స్యలను వెంటనే పరిష్కరించా లని జర్నలిస్టులు శనివారం తహశీల్దార్ పుణ్యవతికి వినతిపత్రం అందజేశా రు.జర్నలిస్ట్ యూనియన్ నాయకు లు మస్తాన్,రమేశ్,శ్రీనివాసబాబు, రామకృష్ణ తదితరులు రెవెన్యూ కా ర్యాలయానికి వెళ్లారు.జర్నలిస్టుల కు వెంటనే ఇంటి స్థలాలు ఇవ్వాల ని,పెన్షన్లు మంజూరు చేయాలని,జ ర్నలిస్ట్ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో పని చేస్తు న్న జర్నలిస్టుల సమస్యల పరిష్కా రం గురించి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడ రేషన్,ఆంధ్రప్రదేశ్ బ్రాడ్కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్లు సంయుక్తంగా ఈ యేడాది మార్చి 4న నిర్వహించి న మహాప్రదర్శనకు గౌరవ సమాచార శాఖ మంత్రి కొలు సు పార్థసారథి హాజరై ఇచ్చిన హామీ ల ఫలితంగా కొన్ని సమ స్యలు పరిష్కారమయ్యాయి. అందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మా కృతజ్ఞతలు.ఇప్ప టికీ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అ నేక ప్రధాన సమస్యలు పెండింగ్ లో ఉన్నాయి.వాటి పరిష్కారం కోసం మీ ద్వారా ప్రభుత్వానికి ఈ వినతి పత్రం అందజేస్తున్నాం.జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో మీ తోడ్పా టు అన్ని వేళలా ఉండాలని కోరు కుంటున్నాం. 1.జర్నలిస్టుల ఇంటిస్థ లాల కేటాయింపు ఆంధ్రప్రదేశ్ లో జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయింపు సమస్య చాలాయేళు గా అపరిష్కృ తంగా ఉంది.ఎన్నికల సమయంలో నే జర్నలిస్టులకు ఇంటి స్థలం కేటా యిస్తామని ప్రణాళికలో ప్రకటించ డంతో అందరూ ఎంతో ఆశగా ఎదు రుచూస్తున్నారు.రాష్ట్రంలోని జర్నలి స్టులకు ఒకరికి మూడు సెంట్లు చొ ప్పున కేటాయిస్తామని గత ప్రభు త్వం జీవో జారీ చేసి దరఖాస్తులను స్వీకరిం చింది.వారికి స్థలాల కేటా యింపు చేయడంతో పాటు అర్హులైన జర్నలిస్టు లందరికీ ఇళ్లస్థలాలు కేటా యించేందుకు వీలుగా ప్రభు త్వం తగిన ఉత్తర్వులు జారీ చేయా లని కోరుతున్నాం.ఇళ్లు కట్టుకునేం దుకు తగిన ఆర్థిక సహాయం అందిం చాలని కో రుతున్నాం.జర్నలిస్టుల ఇంటి స్థలాలకు సంబంధించి రాష్ట్రంలోని విజయవాడ నున్న సొసైటీ,వి శాఖ పట్నంలోని సొసైటీ, అనంతపురం జిల్లా హిందూపురంలో జర్నలి స్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2009 ఫిబ్రవరిలో విశాఖపట్నం జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరు చేస్తూ ప్ర భుత్వం ఇచ్చిన ఉత్తర్వులకు అను గుణంగా జర్నలిస్టులు ప్రభుత్వానికి నిర్ణయించిన ధర చెల్లించినప్పటికీ ఇప్పటివరకు స్థలాలు అప్పగించలే దు.అనంతపురం జిల్లా హిందూపు రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించినప్పటికీ వారికి అప్పగిం చలేదు. గిరిజన ప్రాంతాల్లోని జర్నలి స్టులకు సమీపంలోని మైదాన ప్రాం తాల్లో ఇళ్లస్థలాల కేటాయింపు చే యాలని అభ్యర్థిస్తున్నాం. రాష్ట్రం లోని జర్నలిస్టుల గృహనిర్మాణానికి తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కల్పించే యోచన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.2.మీడియా కమిషన్ ఏ ర్పాటు చేయాలి:మారిన పరిస్థితు ల్లో జర్నలిజం వృత్తి ప్రమాదంలో ప డింది.జర్నలిస్టుకు రక్షణ కొరవడిం ది.రక్షణ లేని వృత్తిగా జర్నలిజం ప్ర పంచదేశాల్లో 157వ స్థానంలో ఉం ది.ప్రజాస్వామిక దేశమైనప్పటికీ జ ర్నలిస్టుల ఉద్యోగ భద్రత,పని పరిస్థి తులు,ఇతర సదుపాయాలు తది తర అంశాలన్నింటిపై అధ్యయనం చేయాలి.

## విడపనకల్లు మోడల్ స్కూల్ ఘటన

# కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం

**- ఇన్‌చార్జి డీఈఓకు వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం వినతిపత్రం**

**- ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో భద్రతా చర్యలు బలోపేతం చేయాలని డిమాండ్**



**అనంతపురం టౌన్- సూర్య వాస్తవం :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థుల భద్రత నిర్లక్ష్యానికి గురవుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఆరోపించింది. విడపనకల్లు మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినుల మధ్య జరిగిన ఘర్షణ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం అనంతపురం జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ, విడపనకల్లు మోడల్ స్కూల్‌లో చోటు చేసుకున్న ఘటన రాష్ట్ర విద్యా వ్యవస్థలో నెలకొన్న లోపాలను బయటపెట్టిందని విమర్శించారు. విద్యార్థుల భద్రత, మానసిక ఆరోగ్యంపై ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపడంలో విఫలమైందని ఆరోపించారు.ఘటన అనంతరం విద్యార్థినులకు తక్షణ వైద్యసేవలు అందించ డంలో, వారి తల్లిదండ్రులకు సకాలంలో సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం జరిగిందన్న ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ చేప ట్టాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, హాస్టళ్లలో విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో మానసిక ఆరోగ్య నిపుణులతో క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థుల సమస్యలు, ఆందోళనలను తెలుసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వా లని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం డిమాండ్ చేసింది. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలను చేపడతామని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నగర ప్రధాన కార్యదర్శులు ఫయాజ్, పులి కార్తికేయ, మనోజ్, నరేష్, శేఖర్, బబ్లు, మణికంఠ, బాబా ఇమ్రాన్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

**- పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించి, హాస్టల్‌లో నీటి కొరతను పరిష్కరించాలి**

**- వైఎస్సార్‌ఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్**




**ఉరవకొండ - సూర్య వాస్తవం :** విడపనకల్లు మండలం లోని మోడల్ స్కూల్‌లో విద్యార్థినుల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల జరిగిన ఘటనకు బాధ్యులుగా భావిస్తున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, హాస్టల్ వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని వైఎస్సార్‌ఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ అనంత పురం జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని విడపనకల్లు గ్రామానికి చెందిన సుస్మిత, సోఫియా స్థానిక మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నారు. గురువారం రాత్రి వారు నిద్రిస్తున్న సమయంలో అదే పాఠశాలకు చెందిన మరో విద్యార్థిని వారిపై బ్లేడ్‌తో దాడి చేసినట్లు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థినులకు స్వల్ప గాయాల య్యాయని, ప్రమాదం తృటిలో తప్పిందని తెలిపారు.ఇంతటి ఘటన జరిగినప్పటికీ విద్యార్థినుల తల్లిదండ్రులకు హాస్టల్ సిబ్బంది వెంటనే సమాచారం ఇవ్వలేదని వారు ఆరోపించారు. విద్యార్థినులను వెంటనే ఆసుపత్రికి తరలించకుండా నిర్లక్ష్యం చేశారని, ఘటనను తారుమారు చేసే ప్రయత్నం జరిగిందని విమర్శించారు.ఈ విషయాన్ని ఇతరుల ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ప్రిన్సిపల్, వార్డెన్‌ను ప్రశ్నించినట్లు తెలిపారు. ఘటనపై హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యంగా స్పందించారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. దీంతో మోడల్ స్కూల్‌లో చదువు తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు.

హైవేకు సమీపంలో ఉన్న మోడల్ స్కూల్‌కు ఇప్పటికీ కాంపౌండ్ వాల్ లేకపోవడం భద్రతాపరంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నిం చారు. పాఠశాల, హాస్టల్‌లో సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయడం లేదని కూడా ఆరోపించారు.హాస్టల్‌లో తాగునీటి సదుపాయం లేక విద్యార్థులు నీటి కోసం తిరిగి పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. కొండ ప్రాంతంలో ఉన్న హాస్టల్‌లో రాత్రి వేళల్లో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ, వైఎస్సార్‌ఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు మోడల్ స్కూల్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రిన్సిపల్, హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలకు వెంటనే కాంపౌండ్ వాల్ నిర్మించి, హాస్టల్‌లో నీటి కొరతను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌ఎస్‌యూ ఉరవకొండ నియోజకవర్గ నాయకులు పురుషోత్తం, తిమ్మరాజు, మహమ్మద్ వాలి, తయ్యుఫ్, అజిత్, మాభాష, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఎం. హరూన్ రషీద్, నియోజకవర్గ నాయకులు రాజేష్, ప్రవీణ్, తిరుమలేష్, పవన్ బాబు, నాని, ఆర్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, ప్రిన్స్, అన్వర్, శ్యామ్ కుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి నివాస గృహం పునర్నిర్మాణ పనుల పురోగతిపై ఇంటాక్ అధికారుల పరిశీలన



**బ్రహ్మంగారిమఠం-సూర్య వాస్తవం :**శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి చారిత్రక నివాస గృహం పునర్నిర్మాణ పనులను ఇంటాక్ సంస్థ ప్రతినిధులు శనివారం పరిశీలించారు. పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం, మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వామి వారితో సమావేశమై పునర్నిర్మాణ పనుల నాణ్యత, వారసత్వ పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఇంటాక్ ఢిల్లీ ప్రతినిధి, ప్రిన్సిపల్ డైరెక్టర్ ఎ. విజయ కడప ఇన్‌ఛార్జ్ కె. చిన్నపరెడ్డి ఇంజనీర్ పంకజ్ ఇంటాక్ అధికారులు ఆదూరి శంకర్ రెడ్డి ఎన్. సునీల్ కుమార్ రెడ్డి , ముని కుమార్ పాల్గొన్నారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి చారిత్రక వారసత్వాన్ని పరిరక్షిస్తూ, సంప్రదాయ నిర్మాణ శైలిని కాపాడే విధంగా పునర్నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులు సూచించారు. పనులు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగుతున్నాయని వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ సీనియర్ నాయకులు నర్రెడ్డి తులసిరెడ్డి పుట్టినరోజున ప్రత్యేక పూజలు

### - మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోమా అమర్ నాథ్ రెడ్డి



**బ్రహ్మంగారిమఠం -సూర్య వాస్తవం :**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, మాజీ 20సూత్రాల చైర్మన్,మాజీ రాజ్యసభ సభ్యులుకడప జిల్లా మాజీ జడ్పీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం కాంగ్రెస్ కమిటీ (ఏపీసిసి) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్న నర్రెడ్డి తులసిరెడ్డి 75వ పుట్టిన రోజు సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోమా అమర్నాథ్ రెడ్డి జగద్గురు శ్రీవీర బ్రహ్మేంద్ర స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి ఎన్నో పుట్టిన రోజులు ఎలాంటి మచ్చలేని రాజకీయ నాయకులుగా తన రాజకీయ ప్రస్థానం కొనసాగించే క్రమంలో ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకుంటూ వారికి ఆయురారోగ్యం ఆ భగవంతుడు వారికి, వారి కుటుంబానికి ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

## చీకటిమానిపల్లి పంచాయతీలో డోర్ టూ డోర్ కార్యక్రమం



**తనకల్లు -సూర్య వాస్తవం:**మండల పరిధిలోని చీకటిమాను పల్లిలో గడపగడపకు తిరుగుతూకూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన" రెండేళ్ల పాలన అభివృద్ధికి సంక్షేమ కార్యక్రమంలో భాగంగా నేడు చీకటిమానిపల్లి పంచాయతీలో ఘనంగా డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించాము.ఈ కార్యక్రమంలో గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలు ప్రజలకు అందించిన సేవలను ప్రతి ఇంటికి చేరవేస్తూ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమ.అవుతున్నాము. ప్రతి గడపకు ప్రభుత్వం చేసిన మంచి ప్రతి కుటుంబానికి అభివృద్ధి సంక్షేమం గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బడా కోటిరెడ్డి , బూత్ కన్వీనర్లు రవి, టిడిపి యువ నాయకులు బడా అమరేశ్వర్ రెడ్డి , ఈశ్వరయ్య. ఆది టిడిపి కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## చంద్రపల్లిలో టీడీపీ ఇంటింటికి ప్రచారం

### -తన స్వగ్రామంలో పాల్గొన్న డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్



**ప్యాపిలి- సూర్య వాస్తవం:** తెలుగుదేశం పార్టీ డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి చేరుకుని, ప్రభుత్వ అబి వృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాల పంపిణీ నిర్వహించారు ప్రజల ఆశీర్వాదమే మా బలం అని తెలుగుదేశం పార్టీ నినాదం ప్యాపిలి మండలం చంద్ర పల్లి గ్రామంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు పేర్కొన్నారు అలాగే తెలుగుదేశం ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు కాలంలో మొదటిగా డీఎస్సీ ఉద్యోగాలు భర్తీ చేయడం మరియు అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా ప్రతి రైతుకు సంవత్సరానికి ?7,000 వేయడం జరిగింది ఒక సంవత్సరానికి మూడు సిలిండర్లు ఫ్రీగా ఇవ్వడం జరుగుతుంది స్త్రీ శక్తి పథకం లో భాగంగా ప్రతి మహిళకు ఉచిత బస్సు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు చెప్పిన విధంగా అన్ని పథకాలు సక్రమంగా కూటమి ప్రభుత్వం అన్ని చేపడుతుంది .ఈ కార్యక్రమంలో చంద్రపల్లే గ్రామ నాయకులు పాల రామకృష్ణ బోయ వెంకట్ రాముడు బాల్రెడ్డి రమణ శేఖర్ రామయ్య నరేషు సందీప్ బెస్త చంద్ర డీలర్ సుంకన్న పాల జయరాములు హరిజన శ్రీరాములు కొండన్న వెంకటేశు తదితర నాయకులు పాల్గొన్నారు.

# డాక్టర్ ఎన్ తులసి రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

### -అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



**రాయచోటి-సూర్య వాస్తవం:** ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర మీడియా చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి 76వ జన్మదిన వేడుకలను శనివారం కడప జిల్లా వేంపల్లి మండలంలోని తులసి రెడ్డి నివాసంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుక కు హాజరైన ఏపీసిసి జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా, అన్నమయ్య జిల్లా సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్.రెడ్డి సాహెబ్ లు మర్యాదపూర్వకంగా కలిసి తులసి రెడ్డికి శాలువా కప్పి, పూలమాలవేసి ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతున్న నిస్వార్ధ రాజకీయ నాయకుడు డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి జీవిత కాలం ఆరోగ్యంగా ఉండాలని వారు ఆకాంక్షింస్తూ జన్మదిన శుభాకాంక్షలుతెలియజేశారు.ఈవేడుకలోఅన్నమయ్య జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరత్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి ముబారక్ ఖాన్, డిసిసి మాజీ కార్యదర్శి యూసుఫ్ అలీ, మండల మైనార్టీ నాయకులు ఇర్ఫాన్, మదనపల్లి నియోజకవర్గ మాజీ కార్యదర్శి మహమ్మద్ అలీ కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం పాల్గొని తువసి రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

### - అమరావతి అక్రిడిడెషన్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.అభినయ్



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డిని ఆయన స్వగృహంలో శనివారం అమరావతి అక్రిడిటేషన్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.అభినయ్ మర్యాద పూర్వకంగా కలిసి తులసి రెడ్డి 76వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అభినయ్ మాట్లాడుతూ నిస్వార్ధ రాజకీయ నాయకుడు, వార్తల్లోని వ్యక్తి, నిరంతరం కాంగ్రెస్ పార్టీ బలోపేతం లక్ష్యంగా పనిచేస్తున్న డాక్టర్ ఎన్ తులసి రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, ఇలాగే వంద పుట్టినరోజులు జరుపుకోవాలని మనసారా కోరుకుంటున్నాను అని అన్నారు.

# శిశువు ఆరోగ్యానికి తల్లిముర్రుపాలే అమృతం

### - నక్కలదిన్నె వైద్యాధికారి డాక్టర్ పి.ఓబులేసు




**చాపాడు -సూర్య వాస్తవం :** మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లక్ష్మీపేట సచివాలయం లోనీ అంగన్వాడీ కేంద్రం లో డాక్టర్ పి.ఓబులేసు ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవం ఆగస్టు నెల ఒకటవ తేదీ నుండి ఏడవ తేదీ వరకు అన్ని సచివాలయాలలో వారోత్సవాలు జరుగుతాయని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి ఓబులేసు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ ఓబులేసు మాట్లాడుతూ తల్లిపాలు తల్లి--బిడ్డల మధ్య ప్రేమ, ఆప్యాయత, భద్రతను పెంచే అమూల్యమైన బంధమని, పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు ప్రారంభించడం నవజాత శిశువుకు ఉత్తమమైన జీవిత ప్రారంభమని, శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు తల్లిపాలలో సహజంగానే ఉంటాయ న్నారు. తల్లిపాలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని అందించి అనేక అంటువ్యాధుల నుండి రక్షిస్తాయని, తల్లిపాలు ఎప్పుడూ పరిశుభ్రంగా, సరైన ఉష్ణోగ్రతలో, కలుషితం కాకుండా సిద్ధంగా ఉంటాయని డాక్టర్ ఓబులేసు తెలియజేశారు.డయేరియా, న్యుమోనియా, చెవి ఇన్‌ఫెక్షన్లు, అలర్జీలు వంటి వ్యాధుల ప్రమాదాన్ని తల్లి పాలు తగ్గిస్తాయి. పుట్టిన వెంటనే వచ్చే పసుపు రంగు చిక్కటి పాలు శిశువుకు తొలి సహజ టీకా లాంటివన్నారు. తల్లిపాలు తాగే పిల్లల్లో ఆత్మవిశ్వాసం, మానసిక ప్రశాంతత, భావోద్వేగ వికాసం మెరుగ్గా ఉంటుందని డాక్టర్ పి ఓబులేసు బాలింతలకు, గర్భిణి మహిళలకు సదస్సు కు వచ్చిన మహిళలకు తెలిపారు. అనంతరం ఆరోగ్య విస్తరణ అధికారి యం.రాఘవయ్య మాట్లాడుతూ మొదటి 6 నెలలు నీరు కూడా ఇవ్వకుండా తల్లిపాలు మాత్రమే ఇవ్వడం అత్యంత అవసరమని, మెదడు, శరీర ఎదుగుదల, తెలివితేటలు, జ్ఞాపకశక్తి అభివృద్ధికి తల్లిపాలు ఎంతో ఉపయో గపడతాయన్నారు.తల్లిపాలు శిశువులో దీర్ఘకాలిక రోగనిరోధక శక్తిని పెంచి ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందిస్తాయన్నారు. అంగన్వాడీ సూపర్ వైజర్ విజయేశ్వరి మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ, సంపూర్ణ, ఉచిత పోషకాహారం తల్లిపాలే. అని ఆమె పేర్కొన్నారు. తల్లిపాలు తాగే పిల్లలు ఆరోగ్యంగా ఎదిగి, ఊబకాయం మరియు కొన్ని దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి యం రాఘవయ్య, సూపర్ వైజర్ ఆర్.భవానీ, ఎ ఎన్ యం కీర్తి, అంగన్వాడీ కార్యకర్త భారతీ, ఆశా కార్యకర్తలు రూప కళ, పద్మావతీ, బాలింతలు, గర్భవతులు, మహిళలు పాల్గొన్నారు.

# వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

### - ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో పత్తికొండ ఆర్డీఓకు వినతిపత్రం -
### జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా కల్పించాలని విజ్ఞప్తి
### - అర్హులైన జర్నలిస్టులకు ఉచిత బస్సు సౌకర్యం ఇవ్వాలి



**పత్తికొండ - సూర్య వాస్తవం :**ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "డిమాండ్స్ డే" (కోరికల దినోత్సవం) కార్యక్రమంలో భాగంగా వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కర్నూలు జిల్లా నాయకులు అటికెలగుండు నాగలింగన్న, నియోజకవర్గం చిన్నారెడ్డి, ఎం. రమేష్‌లు విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, అక్రిడిటేషన్లు, ఇళ్ల స్థలాలు, పెన్షన్, ఆరోగ్య బీమా, మీడియా కమిషన్ ఏర్పాటు తదితర ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు తదితర అధికారులకు వినతిపత్రాలు సమర్పించే కార్యక్రమంలో భాగంగా పత్తికొండ ఆర్డీఓ బి. చిన్న ఓబులేసుకు వినతిపత్రం అందజేశారు.జర్నలిస్టులకు సంబంధించిన ముఖ్యమైన డిమాండ్లను వారు వివరించారు. ఇళ్ల స్థలాలు: అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు, సరసమైన ధరలకు గృహాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

మీడియా కమిషన్: రాష్ట్రంలో తక్షణమే మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మీడియా రంగంలో పనిచేస్తున్న వారికి న్యాయం చేయడంతో పాటు, వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మీడియా కమిషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. రవాణా సౌకర్యాలు: వార్తల సేకరణ నిమిత్తం వివిధ ప్రాంతాలకు తరచూ ప్రయాణించాల్సి వస్తుందని, అర్హులైన జర్నలిస్టులకు ఏసీ బస్సు పాసులు లేదా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. జర్నలిస్టుల రక్షణ చట్టం సమాజంలో జరుగుతున్న అంశాలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకొస్తున్న జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాజకీయ నాయకులు, అవినీతి అధికారులపై వార్తలు రాసే విలేకరులకు చట్టబద్ధమైన రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, తక్షణమే అమలు చేయాలని నాయకులు కోరారు.




## అనుపమ 'క్రేజీ కళ్యాణం'.. నవ్వులు పంచే టీజర్ వచ్చేసింది!

- అనుపమ పరమేశ్వరన్ కొత్త చిత్రం 'క్రేజీ కళ్యాణం'
- విడుదలైన సినిమా ఫన్నీ టీజర్
- తండ్రీకూతుళ్ల మధ్య వినోదభరితమైన డ్రామా
- నరేశ్, తరుణ్ భాస్కర్ కీలక పాత్రల్లో
- దర్శకుడిగా బద్రప్ప గజులకు ఇది తొలి చిత్రం

ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'క్రేజీ కల్యాణం'. భద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను శనివారం చిత్ర యూనిట్ విడుదల చేసింది. నవ్వులు, భావోద్వేగాలు, ఊహించని మలుపులతో కూడిన ఈ టీజర్, ఒక పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకులకు అందిస్తామని హామీ ఇస్తోంది. టీజర్ ప్రారంభంలో.. తండ్రి పాత్రలో నటిస్తున్న డాక్టర్ నరేశ్, తన కూతురు కీర్తి (అనుపమ) పెళ్లిని ఎంత ఘనంగా చేయాలనుకుంటున్నారో ప్రేమగా చెబుతారు. "నీ పెళ్లిని అంగరంగ వైభవంగా జరిపిస్తా" అంటూ ఆయన చెప్పే మాటలు ఆకట్టుకుంటాయి. అయితే, తండ్రి ఆశలకు భిన్నంగా కీర్తికి వేరే ప్రణాళికలు ఉన్నట్టు తెలుస్తోంది. "నీ కొడుకు ఒక్కడే మొండివాడు అనుకుంటున్నావా? నాలోనూ అదే రక్తం ప్రవహిస్తోంది" అని నానమ్మతో అనుపమ చెప్పే డైలాగ్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. తన అన్నకు తన పెద్దల్లుడి కంటే దరిద్రుడైన అల్లుడు రావాలని నరేశ్ దేవుడికి మొక్కుకోవడం, మంచంపై పడుకున్న వ్యక్తిపై అనుపమ కారం చల్లడం వంటి సన్నివేశాలు కడుపుబ్బ నవ్విస్తున్నాయి. మొత్తం మీద ఈ టీజర్ ఒక క్రేజీ వెడ్డింగ్ సెలబ్రేషన్‌ను తెరపై చూపిస్తుందనే అంచనాలను పెంచింది. ఈ చిత్రంతో భద్రప్ప గాజుల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. యారో సినిమాస్ పతాకంపై నిర్మిస్తున్న ఈ సినిమాలో నరేశ్, తరుణ్ భాస్కర్, అఖిల్ రాజ్ ఉద్దేమరి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సురేశ్ బొబ్బిలి సంగీతం అందిస్తుండగా, శ్యామ్ దూపాటి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## తమిళనాడు సీఎం విజయ్ గెలుపుపై
# తొలిసారి స్పందించిన కుమారుడు

- విజయ్ గెలుపును ఒక 'చారిత్రక విప్లవం'గా అభివర్ణన
- ఈ గెలుపు తమ కుటుంబంపై మరింత బాధ్యతను పెంచిందన్న జేసన్
- ప్రస్తుతం నటనపై ఆసక్తి లేదని, దర్శకత్వంపైనే దృష్టి అని స్పష్టీకరణ



తమిళనాడు ముఖ్యమంత్రి, స్టార్ హీరో విజయ్ రాజకీయ విజయంపై ఆయన కుమారుడు, యువ దర్శకుడు జేసన్ సంజయ్ తొలిసారిగా స్పందించాడు. తన తండ్రి సాధించిన ఈ విజయాన్ని ఒక "చారిత్రక విప్లవం"గా అభివర్ణించాడు. ఈ గెలుపు తమ కుటుంబంపై అదనపు బాధ్యతను మోపిందని, ఇకపై తాము మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించాడు. ఈ సందర్భంగా జేసన్ మాట్లాడుతూ, "ఇది ఒక చారిత్రక విప్లవం. దీనివల్ల నాపై, నా సోదరిపై, మా కుటుంబంపై వారసత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత పెరిగింది. ఆ వారసత్వాన్ని మేం నిలబెట్టుకోవాలి. ఇకపై చాలా జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది" అని తెలిపాడు. తన తండ్రి విజయ్ తనను ఎప్పుడూ స్వశక్తితో ఎదగాలని ప్రోత్సహించేవారని, తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని చెప్పేవారని గుర్తుచేసుకున్నాడు. "నాన్న నన్ను ఎప్పుడూ స్పూన్ ఫీడ్ చేయలేదు. అందుకు నేను ఆయనకు, అమ్మకు, నా కుటుంబానికి ఎంతో రుణపడి ఉంటాను" అని జేసన్ వివరించాడు. ప్రస్తుతం తాను దర్శకత్వం వహిస్తున్న 'సిగ్మా' చిత్రంపైనే పూర్తి దృష్టి సారించానని, నటనపై ప్రస్తుతానికి ఆసక్తి లేదని జేసన్ సంజయ్ స్పష్టం చేశారు. సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాతోనే జేసన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. తన కుటుంబంపై వచ్చే విమర్శలు, ప్రశంసలను ఎప్పటికప్పుడు గమనిస్తుంటానని, కుటుంబం నుంచి తనకు ప్రేమతో పాటు గొప్ప బాధ్యత కూడా లభించిందని ఆయన పేర్కొన్నారు.

# పక్కా కామెడీ ఎంటర్‌టైనర్



హీరో వరుణ్ తేజ్ సరికొత్త అవతార్‌లో కనిపిస్తున్న 'కొరియన్ కనకరాజు' పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హారర్ కామెడీని యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్ మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తాజాగా హీరో రామ్ చరణ్ ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసి అంచనాలను మరింత పెంచేశారు. హీరో వరుణ్ తేజ్ మాట్లాడుతూ, 'ట్రైలర్ మీ అందరికీ నచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. ఒక మంచి కామెడీ ఎంటర్‌టైనర్‌తో మిమ్మల్ని అలరించాలని ఈ సినిమా చేశాం. ఈనెల 7న థియేటర్లలో ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నాను. ఇందులో నేను రెండు పర్సనాలిటీస్‌లో కనిపిస్తాను. ఇది పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్. ఒకే బాడీలో రెండు ఆత్మలు ఉంటే ఎలాంటి ఛాలెంజెస్ వుంటాయి. పెర్ఫార్మెన్స్‌కు మంచి స్కోప్ ఉన్న పాత్ర దొరికింది. డైరెక్టర్ రాసుకున్న పాత్రకు పూర్తి న్యాయం చేయడానికి ప్రయత్నించాను. ఈ సినిమా చేయడం నటుడిగా నాకు చాలా సంతృప్తిని ఇచ్చిందిఅని తెలిపారు. 'నేను చేసిన ప్రతి సినిమాకు తెలుగు ప్రేక్షకులు ఎంతో ప్రేమ చూపించారు. ఈ సినిమాలో నేను చేసిన చైత్ర పాత్ర కూడా మీ అందరికీ నచ్చుతుంది అని రీతికా నాయక్ చెప్పారు. దర్శకుడు మేర్లపాక గాంధీ మాట్లాడుతూ,' సినిమాలో ఇంకా ఎక్కువ ఫన్, కామెడీ ఉంటుంది. మనోజ్ అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. థమన్ అద్భుతమైన రీ-రికార్డింగ్ అందిస్తున్నారుఅని అన్నారు. డీఓపీ మనోజ్ మాట్లాడుతూ,'అనంతపురం, కొరియాను చాలా అందంగా, అద్భుతంగా ప్రజెంట్ చేశాం. ఇది చాలా మంచి కథ. తప్పకుండా మీరు థియేటర్‌లో సినిమా చూసి మమ్మల్ని ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాను అని తెలిపారు.



## కామన్వెల్త్ గేమ్స్:
# భారత మహిళా బాక్సర్ల పంచ్ పవర్...
## ఒకే రోజు 5 పసిడి పతకాలు

- కామన్వెల్త్ గేమ్స్ బాక్సింగ్‌లో భారత్‌కు స్వర్ణాల పంట- మహిళల బాక్సింగ్‌లో ఒకేరోజు ఐదు బంగారు పతకాలు
- సాక్షి, జాస్మిన్, ప్రీతి, ప్రియ, అరుంధతి స్వర్ణాలు కైవసం- ప్రత్యర్థులపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత బాక్సర్లు

అంతర్జాతీయ వేదికపై మరోసారి భారత బాక్సింగ్ సత్తా కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత మహిళా బాక్సర్లు సంచలనం సృష్టించారు. యూకేలోని గ్లాస్గో వేదికగా శనివారం జరిగిన బాక్సింగ్ ఫైనల్స్‌లో ఏకంగా ఐదు స్వర్ణ పతకాలు సాధించి చరిత్ర సృష్టించారు. సాక్షి (51 కేజీలు), జాస్మిన్ (57 కేజీలు), ప్రీతి (54 కేజీలు), ప్రియ (60 కేజీలు), అరుంధతి చౌదరి (70 కేజీలు) తమ ఫైనల్ బౌట్లలో అద్భుతమైన ప్రదర్శనతో పసిడి పతకాలను ముద్దాడారు. ఈ విజయాలతో అంతర్జాతీయ బాక్సింగ్‌లో భారత్ తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న విషయాన్ని మరోసారి చాటిచెప్పారు. శనివారం జరిగిన ఫైనల్స్‌లో భారత బాక్సర్ల జోరు ముందు ప్రత్యర్థులు నిలవలేకపోయారు. 51 కేజీల విభాగంలో సాక్షి చౌదరి, ఇంగ్లండ్‌కు చెందిన రూబీ వైట్‌పై 5-0 ఏకగ్రీవ నిర్ణయంతో ఘనవిజయం సాధించింది. బౌట్ ఆద్యంతం పదునైన ఫుట్‌వర్క్‌తో, కచ్చితమైన పంచ్‌లతో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. అదేవిధంగా, 57 కేజీల విభాగంలో జాస్మిన్.. నార్తర్న్ ఐర్లాండ్ బాక్సర్ మైఖేలా వాల్ష్‌పై 5-0తో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. 54 కేజీల విభాగంలో ప్రీతి, కెనడా బాక్సర్ ఎస్.ఎస్. డెల్గాడోపై 5-0 తేడాతో గెలవడమే కాకుండా, బౌట్ మధ్యలో ప్రత్యర్థిని నాక్‌డౌన్ చేసి తన సత్తా చాటింది. ఇక 70 కేజీల విభాగంలో అరుంధతి చౌదరి కూడా ఇంగ్లండ్ బాక్సర్ చాంటెల్ రీడ్‌పై 5-0తో సునాయాసంగా గెలిచింది. వీరితో పాటు 60 కేజీల విభాగంలో ప్రియ ఘూంఘస్, కెనడాకు చెందిన మేరీ-బతౌల్ అల్-



అహ్మదియాతో హోరాహోరీగా తలపడింది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన ఈ పోరులో 4-1 స్ప్లిట్ డిసిషన్‌తో ప్రియ విజేతగా నిలిచింది. తొలి రౌండ్‌లో కాస్త వెనుకబడినప్పటికీ, ఆ తర్వాత పుంజుకుని పదునైన పంచ్‌లతో న్యాయనిర్ణేతలను మెప్పించింది. ఈ అద్భుత విజయాలతో అంతర్జాతీయ వేదికలపై మహిళల బాక్సింగ్‌లో భారత్ తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఒకే ఈవెంట్‌లో ఐదుగురు మహిళా బాక్సర్లు స్వర్ణాలు గెలవడం భారత క్రీడా చరిత్రలోనే ఒక అరుదైన ఘనత. గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో భారత పతకాల సంఖ్యను పెంచడంలో బాక్సింగ్ బృందం కీలక పాత్ర పోషించింది. మొత్తం టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రతిభ, వ్యూహాత్మక నైపుణ్యం ప్రదర్శించిన భారత మహిళా బాక్సర్లు, దేశానికి గర్వకారణంగా నిలిచారు.



## లండన్‌లో రోహిత్ శర్మ..
## 'రిలాక్స్డ్' అంటూ రవిశాస్త్రి పోస్ట్!

**లండన్‌లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను కలిసిన రవిశాస్త్రి**
**'రిలాక్స్‌డ్ శర్మా' అంటూ సోషల్ మీడియాలో ఫొటోతో పాటు పోస్ట్**

టీమిండియా మాజీ కోచ్, ప్రముఖ కామెంటేటర్ రవిశాస్త్రి చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. లండన్‌లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను కలిసిన శాస్త్రి, ఇద్దరూ కలిసి దిగిన ఫొటోను పంచుకున్నాడు. "లండన్‌లో షికారుకు వెళ్లినప్పుడు రిలాక్స్‌డ్‌గా ఉన్న 'శార్మ'ను కలవడం ఆనందంగా ఉంది" అని ఆ పోస్ట్‌కు క్యాప్షన్ జోడించారు. శర్మ అనే పేరును 'శార్మ' అంటూ దీర్ఘంతో పలకడం విశేషం. ఈ ఫొటోలో రోహిత్ భుజంపై చేయి వేసి రవిశాస్త్రి నవ్వుతూ కనిపించగా, రోహిత్ కూడా ఎంతో ప్రశాంతంగా చిరునవ్వు చిందిస్తున్నాడు. అయితే, రవిశాస్త్రి వాడిన 'రిలాక్స్‌డ్' అనే పదానికి సాధారణం కంటే లోతైన అర్థం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవలే ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్ ఫైనల్ మ్యాచ్‌కు ముందు రోహిత్ శర్మ కెరీర్‌పై తీవ్రమైన ఊహాగానాలు చెలరేగాయి. 2027 ప్రపంచకప్ ప్రణాళికల్లో రోహిత్ లేడని, లార్డ్స్‌లో జరిగే ఆఖరి వన్డేనే అతనికి చివరి మ్యాచ్ కావొచ్చని కొన్ని ప్రముఖ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. ఈ వార్తలను బీసీసీఐ ఖండించినప్పటికీ, రోహిత్ భవిష్యత్తుపై తీవ్రమైన చర్చ జరిగింది. దీంతో రోహిత్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ఈ విమర్శలు, ఊహాగానాల నడుమ... తనపై ఉన్న ఒత్తిడినంతా బ్యాట్‌తోనే బద్దలు కొట్టాడు రోహిత్ శర్మ. లార్డ్స్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో కేవలం 111 బంతుల్లో 138 పరుగులు చేసి అద్భుతమైన శతకంతో విమర్శకుల నోళ్లు మూయించాడు. ఈ నేపథ్యంలో, లండన్‌లో రవిశాస్త్రికి ఎదురుపడిన రోహిత్ శర్మ ఎంతో ప్రశాంతంగా, బరువు తగ్గి మరింత యంగ్ గా కనిపించడం ప్రాధాన్యం సంతరించుకుంది. కెరీర్‌పై వచ్చిన పెను తుపానును తన అద్భుత ప్రదర్శనతో ఎదుర్కొని, ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నాడనే విషయాన్ని రవిశాస్త్రి తన పోస్ట్ ద్వారా చెప్పకనే చెప్పారు. ఈ పోస్ట్, రోహిత్ శర్మ మానసిక స్థితిపై సానుకూల సంకేతాలను పంపుతోంది.

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం

## - ఆగస్టు 1 నుంచి 7 వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు



**పెళ్లకూరు – సూర్య వాస్తవం:** తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంపొందించి తల్లి--శిశు ఆరోగ్యాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో నాయుడుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు శనివారం తల్వాయపాడు బీసీ అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టర్ ప్రదర్శనలు, అవగాహన సమావేశాలు, గర్భిణులు, బాలింతలతో ప్రత్యేక చర్చలు, ఇంటింటి ప్రచారం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ కె. ఉమామహేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించడం అత్యంత అవసరమన్నారు. మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఈ కాలంలో నీరు, తేనె, పశుపాలు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని సూచించారు. ఆరు నెలలు పూర్తయిన తర్వాత ఇంట్లో తయారుచేసిన మెత్తని, పోషకాహారాన్ని అందిస్తూ, రెండేళ్ల లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని వివరించారు. సూపర్‌వైజర్ శ్రీ సాయి లక్ష్మీ మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందించడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. అంటువ్యాధుల నుంచి శిశువును రక్షించడంలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని, తల్లికి కూడా పలు ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని చెప్పారు. ఉద్యోగం చేసే తల్లులు తల్లిపాలను పరిశుభ్రంగా సేకరించి, శుభ్రమైన పాత్రలో నిల్వ చేసి, అవసరమైన సమయంలో సరైన విధంగా శిశువుకు అందించే పద్ధతులను పోస్టర్లు, ప్రదర్శనల ద్వారా వివరించారు. పాలు పిండే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన పాత్రలో నిల్వ చేయడం, నేరుగా మంటపై వేడి చేయకుండా గోరువెచ్చని నీటిలో వేడి చేసి ఇవ్వడం వంటి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్ సూచనల మేరకు తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, అనంతరం అనుబంధ పోషకాహారంతో పాటు రెండేళ్ల లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం శిశువుల ఆరోగ్యానికి అత్యంత మేలు చేస్తుందని అధికారులు వివరించారు. వారోత్సవాల సందర్భంగా ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లిపాల ప్రాధాన్యత, శిశు పోషణ, పరిశుభ్రత, మాతా--శిశు ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సాయి లక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు వి. స్వరూపరాణి, కె. ఉషా, కె. అదేమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, ఏఎన్ఎం మమత, ఆశా కార్యకర్తలు రాజమ్మ, విజయలక్ష్మి, ప్రశాంతి, గర్భిణులు, బాలింతలు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే విజయశ్రీ



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** దొరవారిసత్రం మండల పరిధిలోని వెదురుపట్టు తుంగమడుగు మొదలగు గ్రామాలలో శనివారం సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తూ ఉన్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రభుత్వం వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు ప్రతి నెల సకాలంలో పెన్షన్లను అందజేసి ప్రతి ఒక్కరూ కళ్ళల్లో ఆనందాన్ని చూడడం జరుగుతూ ఉన్నది, ప్రజల యొక్క సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అంటూ ఎమ్మెల్యే అన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న ఇంటింటికి వెళ్లి పెన్షన్లను పంపిణీ చేస్తూ రెండేళ్లలో రాష్ట్రంలో చేసిన అభివృద్ధి పథకాలను తెలియజేస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, దొరవారిసత్రం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి. నెలబల్లి సొసైటీ అధ్యక్షులు శ్రీహరి రెడ్డి, నాయకులు షబీర్, ఉదయ్ కుమార్, ప్రసాద్ నాయుడు, మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు సంజీవినిల పనిచేస్తుంది

### - పుట్టిన మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలునే బిడ్డకు పట్టించాలి

### - తల్లిపాలు వారోత్సవాల్లో అంగనవాడి సూపర్వైజర్ అంకమ్మ



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం :** తల్లిపాలు బిడ్డకి అమృతం లాంటివి, బిడ్డ తల్లి పాలు త్రాగడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరగడమే కాకుండా బిడ్డ ఎదుగుదల బాగా ఉంటుంది అని అంగనవాడి సూపర్వైజర్ అంకమ్మ అన్నారు, ఆమె శనివారం మండల పరిధిలోని తుంగమడుగు అంగనవాడి కేంద్రంలో ఏర్పాటు చేసిన తల్లిపాలు వారోత్సవాలలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శిశువు పుట్టిన ఆరు నెలల పాటు తప్పనిసరిగా తల్లిపాలునే పట్టించాలని శిశువులకు తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించడమే తల్లిపాలు వారోత్సవాల ఉద్దేశం అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రతి ఏడాది ఆగస్టు ఒకటవ తేదీ నుంచి 7 వరకు ప్రతి అంగన్వాడి కేంద్రాల్లో తల్లిపాలు వారోత్సవాలను జరుపుకోవడం జరుగుతుందని అన్నారు. అంతేకాకుండా బిడ్డకు వారి తల్లులు మురుపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు టీకా లాగా పనిచేసి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది అన్నారు. పైగా తల్లిపాలు శిశువుకు సంజీవిని లా పనిచేస్తుందన్నారు. దీంతోపాటు శారీరిక మానసిక వికాసానికి దోహదపడుతుందన్నారు. తదనంతరం తల్లిపాలు ప్రాధాన్యతను వివరించారు. తల్లులు బిడ్డలు పౌష్టికంగా ఉండాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలలో పౌష్టికాహారాన్ని అందిస్తుంది ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని బాలింతలకు గర్భవతులకు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో అంగనవాడి కార్యకర్తలు బాలింతలు గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం సంక్షేమ విజయాలు ఇంటింటికి ప్రచారం

**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** మండల పరిధిలోని కల్లూరు కండ్రిగ గ్రామంలో శనివారం సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ్ శ్రీ నాయకత్వంలో మరియు దొరవారిసత్రం మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు ఆదేశాల మేరకు దొరవారిసత్రం మండలం కల్లూరు కండ్రిగ గ్రామంలో మాజీ సర్పంచ్ టిడిపి సీనియర్ నాయకులు ఇట్టా గుంట మల్లికార్జున రావు చేతుల మీదగా మరియు 177 బూతు కన్వీనర్ సగిలి సురేష్ చేతుల మీదుగా కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు చేసిన అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలు పంపిణీ చేశారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వ నాయకత్వంలో జరిగినటువంటి రెండేళ్ల పరిపాలనలో అభివృద్ధి చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లికార్జున రావు మరియు బూతు కన్వీనర్ సగిలి సురేష్ తెలుగుదేశం కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో ఘనంగా పింగళి వెంకయ్య జయంతి వేడుకలు



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** కర్నూలు ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో భారత జాతీయ పతాక రూపకర్త, మహనీయుడు పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు శెట్టి హాజరై మాట్లాడుతూ, పింగళి వెంకయ్య దేశభక్తి, జాతీయ పతాక రూపకల్పనలో చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. త్రివర్ణ పతాకం భారతీయుల ఐక్యత, స్వాతంత్ర్య స్ఫూర్తి, జాతీయ గౌరవానికి ప్రతీక అని, ప్రతి విద్యార్థి జాతీయ పతాకాన్ని గౌరవించడం తన బాధ్యతగా భావించాలని సూచించారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పింగళి వెంకయ్య జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని, దేశం కోసం నిస్వార్థంగా సేవ చేసిన మహనీయుల ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని అన్నారు. విద్యతో పాటు విలువలను అలవరచుకున్నప్పుడే సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. విద్యార్థులు పింగళి వెంకయ్య జీవిత విశేషాలను వివరిస్తూ ప్రసంగాలు చేయడంతో పాటు దేశభక్తి గీతాలను ఆలపించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మల్లికార్జున, విజయశేఖర్, రామకృష్ణ, ఉల్గోజి రావు, బాల శంకర్, లావణ్య పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం చివర్లో భారత జాతీయ పతాక విశిష్టతను, పింగళి వెంకయ్య చేసిన సేవలను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని పిలుపునిస్తూ జాతీయ గీతంతో కార్యక్రమాన్ని ముగించారు.

# డీఎస్సీ అవకతవకలపై కీలక సమావేశం

### -ఆగస్టు 3న అనగా సోమవారం నాడు నాయుడుపేటలో నిర్వహణ



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రివర్యులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి వర్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి సూచనల మేరకు, రాష్ట్రంలో డీఎస్సీ నియామక ప్రక్రియలో జరిగిన అవకతవకలు, అక్రమాలు, అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై చర్చించి, పార్టీ భవిష్యత్ కార్యాచరణను రూపొంది ంచేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 2026 ఆగస్టు 3వ తేదీ (సోమవారం) నాడు ఉదయం 9.00 గంటలకు నాయుడుపేటలోని ఐసీఐసీఐ బ్యాంక్ భవనం మిద్దెపైన ఉన్న ఫంక్షన్ హాల్‌లో కీలక సమావేశం నిర్వహిం చబడు తుంది. ఈ సమావేశానికి సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీ వయ్య ముఖ్య అతిథిగా హాజరై, డీఎస్సీ నియా మక ప్రక్రియలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై పార్టీ చేపట్టనున్న ఉద్యమ కార్యాచరణ, అభ్యర్థుల సమస్యలు, రానున్న పోరాట కార్య క్రమాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతి నిధులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా విభాగ సభ్యులు, డీఎస్సీ అభ్యర్థులు, పార్టీ శ్రేణులందరూ సోమవారం ఉదయం 9.00 గంటలకే సమావేశ ప్రాంగణానికి చేరుకొని, ఈ సమావేశాన్ని విజయవంతం చేయవలసిందిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున విజ్ఞప్తి చేస్తున్నాము. అన్ని శనివారం సూళ్లూరుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

# స్వల్పకాలిక పంటలే శరణ్యం

- ఎల్‌నినో ప్రభావం రాష్ట్రానికి తీవ్ర వర్షాభావం
- వచ్చే రెండు నెలలు తీవ్ర వర్షాభావ సూచనలు,,
- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- రాష్ట్ర వ్యవసాయ శాస్త్రవేత్త
- డాక్టర్ సంపత్ కుమార్ వెల్లడి




**కదిరి – సూర్య వాస్తవం**

ఏరా నేను ప్రభావం వల్ల రాయలసీమలో, ముఖ్యంగా శ్రీ సత్యసాయి జిల్లాలో మరింత వర్షాభావ పరిస్థితులు తీవ్రమయ్యే అవకాశాలున్న నేపథ్యంలో రైతులు సంప్రదాయ పంటల కంటే స్వల్పకాలిక, తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. ముఖ్యంగా బెట్టను తట్టుకునే కొర్ర, సజ్జ, ఉలవ, పెసలు వంటి చిరుధాన్యాలు రైతులకు ఈ క్లిష్ట పరిస్థితుల్లో భరోసానిస్తాయని తెలిపారు. పంటలు పూర్తిగా దిగుబడి ఇవ్వకపోయినా కనీసం పశుగ్రాసంగా ఉపయోగపడే అవకాశం ఉండటం వల్ల రైతులు పూర్తిగా నష్టపోకుండా ఉంటారని వివరించారు.

శనివారం కదిరిలోని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల్లో పంటల నిర్వహణ, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై రాయలసీమ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు . ఈ సమావేశానికి ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరు డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్, జోనల్ కోఆర్డినేటర్, రాయలసీమ నాలుగు జిల్లాల ప్రత్యేక అధికారి డాక్టర్ డి. సంపత్ కుమార్, నంద్యాల వ్యవసాయ పరిశోధన కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ విజయలక్ష్మి, కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి వి భాస్కర్ రెడ్డి, నంద్యాల, అనంతపురం, కర్నూలు తదితర పరిశోధన కేంద్రాల అధిపతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ డి. సంపత్ కుమార్ మాట్లాడుతూ జూన్, జూలై నెలల్లో నమోదైన వర్షపాతం సాధారణం కంటే గణనీయంగా తక్కువగా ఉందని తెలిపారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కూడా ఎల్‌నినో ప్రభావం కొనసాగి వర్షాలు మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు సంప్రదాయ పద్ధతులను పక్కనబెట్టి శాస్త్రీయ సాగు విధానాలను అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు.

**కొర్రే రైతుకు భరోసా...**

ఎల్‌నినో పరిస్థితుల్లో కొర్ర సాగు రైతులకు అత్యంత అనుకూలమని శాస్త్రవేత్తలు వివరించారు. కేవలం 60 రోజుల వ్యవధిలోనే ఈ పంట కోతకు రావడంతో పాటు తక్కువ వర్షపాతం ఉన్నా నిలబడే సామర్థ్యం దీనికి ఉందన్నారు. పంట పూర్తిస్థాయిలో దిగుబడి ఇవ్వకపోయినా పశువులకు మంచి పశుగ్రాసంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. దీంతో రైతుకు కనీస నష్టం మాత్రమే ఉంటుందని వివరించారు. అందుకే ఈ సీజన్‌లో బెట్టకు విరుగుడుగా కొర్రను సాగు చేయాలని సూచించారు. చిరుధాన్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే కొర్రతో పాటు సజ్జ, ఉలవ, పెసలు వంటి స్వల్పకాలిక పంటలను కూడా సాగు చేయాలని శాస్త్రవేత్తలు వివరించారు,. ఇవి తక్కువ నీటితో సాగవుతాయని, ఎండలను తట్టుకునే గుణం కలిగి ఉండటంతో పాటు రైతుకు కొంత ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పంటలు నేల సారాన్ని కూడా కాపాడటంలో ఉపయోగపడతాయని వివరించారు.

వేరుశనగ రైతులకు కీలక సూచనలు జారీ చేశారు. అంతేకాకుండా రైతులు ఇప్పటికే వేరుశనగ సాగు చేసిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సరైన పోషక నిర్వహణ ద్వారా పంటను కాపాడుకోవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. వేరుశనగ ఆకులపై రెండు శాతం యూరియా ద్రావణం లేదా 0.5 శాతం కేఎన్ఓ3 (19:19:19) నీటిలో కరిగే ఎరువును లేదా లీటరు నీటికి ఐదు గ్రాముల సూక్ష్మపోషక మిశ్రమాన్ని పిచికారీ చేయాలని సూచించారు. ఈ చర్యలతో మొక్కల్లో తేమ నిలిచి, పంట ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని వివరించారు.

బీడు భూమి వల్ల సాంకేతికంగా నష్టాల నివారణ.... గురించి వివరించారు. వర్షాధార వ్యవసాయ ప్రాంతాల్లో బీడీ భూముల లో విస్తృతంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. నేలలో తేమను నిల్వ ఉంచే విధానాలు, కలుపు నివారణ, తక్కువ నీటితో సాగు చేసే పద్ధతులు, సమతుల్య ఎరువుల వినియోగం, ప్రత్యామ్నాయ పంటల ఎంపిక వంటి అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులు నిర్ణయించారు.

**గ్రామాల్లోనే రైతులకు సలహాలు...**

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని శాస్త్రవేత్తలు జిల్లాలోని అన్ని మండలాల్లో పర్యటించి పంటల పరిస్థితిని పరిశీలించాలని సమావేశంలో నిర్ణయించారు. రైతుల పొలాల వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకుని తక్షణ సాంకేతిక సలహాలు అందించాలని, అవసరమైన చోట ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేసి శాస్త్రీయ సాగు విధానాలను రైతులకు ప్రత్యక్షంగా చూపించాలని నిర్ణయించారు.

**ముందస్తు ప్రణాళికే రక్షణ...**

వ్యవసాయం పూర్తిగా ప్రకృతిపై ఆధారపడి ఉన్నప్పటికీ, వాతావరణ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు ప్రణాళికతో సాగు చేస్తే నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. రైతులు అధిక పెట్టుబడులతో దీర్ఘకాలిక పంటలకు వెళ్లకుండా, పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుని శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని వారు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అప్రమత్తత, శాస్త్రీయ సాగు, ప్రత్యామ్నాయ పంటల ఎంపికే రైతులకు రక్షణ కవచమని సమావేశంలో నొక్కి నుంచిచెప్పారు.



# కార్మిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ లేబర్ ఆఫీసర్‌గా వెంకటరాముడు



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి కార్మిక సంక్షేమ శాఖ ఇంచార్జ్ లేబర్ ఆఫీసర్ గా వెంకటరాముడు ను నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.. ఆదోని కార్మిక సంక్షేమ శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఈయనను గుత్తి లేబర్ అధికారిగా నియమించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి, ప్రభుత్వం పథకాలను వర్తింపజేసేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# తాగునీటి ఎద్దడి నివారణకు తుంగభద్ర జలాల విడుదల



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని నివారించేందుకు తుంగభద్ర జలాశయం నుంచి హెచ్ఎల్సీకి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎల్సీ తూము వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రారంభంగా 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జలాశయ అధికారులు తెలిపారు.జలాశయానికి వచ్చే వరద నీటి ప్రవాహాన్ని అంచనా వేసి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన హెచ్ఎల్సీ అధికారులు ఇచ్చే ఇండెంట్ మేరకు నీటి విడుదలను క్రమంగా పెంచుతామని తుంగభద్ర జలాశయ ఎస్ఈ నారాయణనాయక్ వెల్లడించారు. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ నీటి సరఫరాను కొనసాగించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని అధికారులు పేర్కొన్నారు.

# హిత ఆసుపత్రి ల్యాబ్ టెక్నీషియన్ అనుమానాస్పద మృతి

- ప్రైవేటు ఆసుపత్రి మూడో అంతస్తు నుంచి పడి యువకుడు మృతి






**అనంతపురం ప్రతినిధి – సూర్య వాస్తవం :** కమలానగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్న 33 ఏళ్ల యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తాడిమర్రి మండలం రామాపురం గ్రామానికి చెందిన యువకుడు రామచంద్ర నగర్‌లోని హిత ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఆసుపత్రి భవనంలోని మూడో అంతస్తు నుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు సమాచారం. యువకుడు ప్రమాదవశాత్తు కిందపడ్డాడా? లేక ఎవరైనా తోసి హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి ఘటనపై విచారణ చేపట్టారు. గతంలో కూడా కొన్ని సంఘటనలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సూర్య వాస్తవం ద్వారా మీ ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తాం.



# ప్రభుత్వ ప్రాధాన్య పనుల్లో నాణ్యత పెంచేలా కృషి చేస్తా

- పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ ఈఈ నాగిరెడ్డి
- ఉద్యోగోన్నతిపై వచ్చిన ఈఈ నాగిరెడ్డికి ఘన స్వాగతం
- నాణ్యతా ప్రమాణాల అమలే ప్రధాన లక్ష్యమన్న ఈఈ నాగిరెడ్డి



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గ్రామీణ ప్రాంత రహదారులు, భవనాల నిర్మాణ పనుల్లో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించేలా కృషి చేస్తానని పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ ఉమ్మడి అనంతపురం జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) ఈదుల నాగిరెడ్డి అన్నారు.కర్నూలు జిల్లా పాణ్యం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈఈ)గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతి పొందిన నాగిరెడ్డిని ప్రభుత్వం అనంతపురం క్వాలిటీ కంట్రోల్ విభాగం ఈఈగా నియమించింది. ఈ నేపథ్యంలో శనివారం ఆయన నూతన బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయానికి చేరుకున్న ఈఈ నాగిరెడ్డిని క్వాలిటీ కంట్రోల్ విభాగం డీఈఈలు ఆవుల లోకన్న, గోపాల్ నాయక్, ఓబులదాస్, ఏఈఈలు భాస్కర్, సంగీత మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిప్పేస్వామితో పాటు ఇతర సిబ్బంది కూడా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

ఈ సందర్భంగా ఈఈ నాగిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ, 1992లో ఏపీపీఎస్సీ ద్వారా ఏఈఈగా ఉద్యోగంలో చేరినట్లు తెలిపారు. నంద్యాల, కర్నూలు ప్రాంతాల్లో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాల్లో విధులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. 2008 నుంచి రాజీవ్ స్వగృహ, ఎస్ఎస్ఏ, క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో డీఈఈగా సేవలందించినట్లు వివరించారు. ఇటీవల నిర్వహించిన ఉద్యోగోన్నతుల ప్రక్రియలో ఈఈగా పదోన్నతి పొంది, ఉమ్మడి అనంతపురం జిల్లా క్వాలిటీ కంట్రోల్ విభాగానికి నియమితులైనట్లు తెలిపారు.ప్రభుత్వ ప్రాధాన్య పనుల్లో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే రహదారులు, భవన నిర్మాణ పనులు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తానని ఈఈ నాగిరెడ్డి తెలిపారు.